ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి


గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 17 జనవరి 2025



నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు



సంక్రాంతి కల్లా.. రోడ్లపై గోతులు ఉండవు. ఐదేళ్లుగా గ్రామీణులు దారులు, డ్రెయిన్లు లేక పడిన ఇబ్బందులు పరిష్కరిస్తాం. అని కూటమి ప్రభుత్వం పల్లెపండుగ పనులతో పాటు గోతులు లేని ఆర్అండ్బీ రోడ్లు అని లక్ష్యం నిర్దేశించుకుంది. అయితే రెండు నెలల క్రితం ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతి లక్ష్యం దిశగా ఆరంభంలో ఆయా పనులు సాగాయి. కానీ అధికారుల్లో నిర్లక్ష్యం.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇప్పటికి సగం పనులు కూడా పూర్తి కాలేదు. సరైన రోడ్లు, డ్రెయిన్లు లేక గత ఐదేళ్లు ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను సంక్రాంతి నాటికి పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. గ్రామసభలను నిర్వహించి పల్లెపండుగకు కార్యాచరణ ఇచ్చినా.. ఆర్అండ్బీ రోడ్లపై గోతులు ఉండకూడదని ప్రత్యేకంగా నిధులు విడుదల చేసినా.. ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంక్రాంతి పండుగ వచ్చింది.. అయినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పల్లెపండుగతో పాటు గోతులు లేని రోడ్ల పనులు నత్తే నయం అన్నట్లుగా సాగాయి. ప్రభుత్వం సంక్రాంతి లక్ష్యం నిర్దేశించగా.. అధికారులు ఏ సంక్రాంతి అనుకున్నారో అంటూ ప్రజలు ప్రస్తుతం సాగుతున్న పనులపై వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు.

- నిలిచిన పల్లెపండుగ పనులు
- గ్రామాల్లో 43.85 శాతం పనులే పూర్తి
- బిల్లుల చెల్లింపుల్లో నెల రోజులుగా జాప్యం
- నత్తతో పోటీ పడుతోన్న ఆర్అండ్బీ అధికారులు
- రెండు నెలలుగా 50 శాతం గోతులనే పూడ్చారు
- జిల్లాకు రూ.13 కోట్లు నిధులిచ్చినా పనుల్లో నీరసమే

జిల్లా	చేపట్టిన పనులు	పూర్తిచేసిన పనులు	పనుల శాతం
పల్నాడు	521	238	45.68
బాపట్ల	640	298	45.57
గుంటూరు	167	69	40.35

ఆర్అండ్బీ.. మరమత్తు

లక్ష్యం.. నిర్లక్ష్యం



గుంతలమయంగా ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకి గోతులు లేని రోడ్లు చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు తగ్గట్లుగా రోడ్లపై గోతులు పూడ్చేందుకు జిల్లాకు రూ.13 కోట్లు పై చిలుకు నిధులు కేటాయించింది. అయినా రోడ్లు, భవనాలు శాఖ అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచారు. సంక్రాంతి నాటికి 100 శాతం పూర్తి కావాల్సిన పనులను కేవలం సగం మాత్రమే పూర్తి చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు అధ్వానంగా మారాయి. గోతుల రోడ్లపై వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గోతుల్లో పడి పలువురు మృతి చెందగా వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మారారు. అయినా నాటి పాలకుల్లో రోడ్లపై గుంతలు పూడ్చాలన్న ఆలోచన చేయలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చడంపై దృష్టి సారించింది. ఆయా రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నిధులను వెంటనే ఖర్చు చేసి రోడ్లు బాగు చెయ్యాలని ప్రభుత్వం ఆదేశించింది.

జనవరి 14 నాటికి పూర్తిగా మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చిన చోట అసిస్టెంట్ ఇంజనీర్లు ఫొటోలు దిగి యాప్‌లో అప్ లోడ్ చెయ్యాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే అధికారుల్లో నిర్లక్ష్యం కారణంగా సంక్రాంతి పండుగ వెళ్లిపోయినా ఆయా పనుల్లో జాప్యం జరుగుతోంది.

కొందరికే పనులతోనే సమస్య..

గోతుల పనులు త్వరగా పూర్తి కావాలంటే ఎక్కువ మంది కాంట్రాక్టర్లకు కేటాయించాలి. గుంటూరు జిల్లాలో మాత్రం మొత్తం పనులన్నీ అతి తక్కువ మంది కాంట్రాక్టర్లకు కేటాయించారు. ఒక్కొక్కరికి ఐదారు పనులు కేటాయించారు. ఆ కొద్దిమంది కాంట్రాక్టర్లు అన్ని పనులు సకాలంలో పూర్తి చేయలేక పోయారు. కాంట్రాక్టర్లు ఒక పని ముగిసిన తర్వాత మరో పని మొదలు పెడుతున్నారు. దీంతో ఇప్పటికీ మూడు జిల్లాల పరిధిలో సగం మాత్రమే పనులు పూర్తి అయినట్లు అర్థమవుతోంది.

మేరికపూడి కూలీలు వస్తేనే..

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్బీ పనులన్నీ కేవలం ఫిరంగిపురం మండలంలోని మేరికపూడి కూలీల మీదే ఆధారపడి జరుగుతుంటాయి. వారు లేకపోతే రోడ్ల పనులు జరగడంలేదు. గత నెలలో సెలవులు, పండుగలు ఎక్కువ రావడంతో సదరు కూలీలు పనులకు రాలేదు. దీంతో కూలీల సమస్యతో పనుల్లో జాప్యం నెలకొంది. ఆ గ్రామానికి చెందిన కూలీలు వచ్చే వరకు అన్ని గ్రామాల్లో పనులు ఆగిపోతున్నాయి. పట్టణాల్లో చాలా వరకు రోడ్లు బాగు చేసినా గ్రామాల పరిధిలో ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రత్తిపాడు-గొట్టిపాడు, నల్లపాడు-బైపాస్ తదితర ప్రాంతాల్లో ఇంకా పనులు ప్రారంభమే కాలేదు. ఆయా రోడ్లలో ప్రయాణం ఇప్పటికీ నరకాన్ని తలపిస్తూనే ఉంది.

ప్రస్తుతం ఆర్అండ్బీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిధులు జమ చేస్తోంది. నవంబరు నుంచి ఇప్పటివరకు చేసిన పనుల కు రూ.7 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమయ్యాయి. సకాలంలో బిల్లులు చెల్లింపులు జరుగుతున్నా పనులు చేయించడంలో అధికారుల్లో నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో పూర్తి కాని పనులు కేవలం 10 రోజుల్లో (జనవరి 26 నాటికి) పూర్తి చేస్తామని అధికారులు చెప్తున్నారు.



నెలాఖరులోగా పూర్తి చేస్తాం

రోడ్ల మరమ్మతులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. ఆర్అండ్బీలో కొందరు మాత్రమే కాంట్రాక్టర్లు ఉన్నారు. అందువల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. దానిని అధిగమించి ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

- సీ విశ్వనాథరెడ్డి, ఈఈ, ఆర్అండ్బీ, గుంటూరు

నిధులు.. నై

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో రెండు నెలల క్రితం పల్లె పండుగలో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించినట్లుగా పల్లె పండుగ పనులు సంక్రాంతి పండుగకు పూర్తి కాలేదు. పూర్తైన పనులకు నెలరోజులుగా బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.కోట్లల్లో బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడంతో గ్రామాభివృద్ధి కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పథకం ప్రారంభంలో వారం.. వారం బిల్లుల చెల్లింపులు జరగడంతో పనులు వేగంగా జరిగాయి. రెండు వారాల తర్వాత బిల్లుల చెల్లింపులు జరగక ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి.

నాడు ప్రభుత్వం.. నేడు అధికారుల నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కనీసం రోడ్లు, మురుగుకాల్వలు వంటి మౌలిక సదుపాయలు కల్పించలేదు. దీంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించింది. సత్వరం చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించి పంచాయతీ తీర్మానాల ద్వారా ప్రతిపాదనలను అధి కారులు రూపొందించారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చే పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. అయితే చేపట్టిన పనుల్లో సగం కూడా పూర్తి కాలేదు. పనులను కాంట్రాక్టుపై కాకుండా నామినేషన్ విధానంలో చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సూచించిన వ్యక్తుల చేత పనులు చేపట్టారు. కాగా పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు. త్వరలోనే బిల్లుల చెల్లింపు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

సగం పనులే పూర్తి..

గుంటూరు జిల్లాలో 132 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారుల బాగుకు రూ.487.90 లక్షలు, 420.467 కిలోమీటర్ల మేర మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల బాగుకు రూ.848.90 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. అయితే ఇప్పటికి మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 175 కిలోమీటర్లు, రాష్ట్ర రహదారులు 72 కిలోమీటర్లు మాత్రమే బాగు చేశారు. ఇంకా సగం పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆర్అండ్బీ లెక్కలు చెప్తున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పల్లెపండుగలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికి 43.85 శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు డ్వామా శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

పల్లెల్లో పనులు ఇలా..

- పల్నాడు జిల్లాలో రూ.62.54 కోట్లతో గ్రామాల్లో రహదారులు, మురుగు కాల్వలు, ప్రభుత్వ పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు చేపట్టారు. 521 పనులు చేపట్టగా ఇప్పటికి 238 పనులు మాత్రమే పూర్తి చేశారు. 70,436 మీటర్ల మేర రోడ్లు, 9,118 మీటర్లలో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టారు.
- బాపట్ల జిల్లాలో 640 పనులను రూ.67.58 కోట్లతో చేపట్టగా ఇప్పటికి 298 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 1,20,964 మీటర్ల మేర రోడ్లు, 1,176 మీటర్ల మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు.
- గుంటూరు జిల్లాలో 167 పనులను రూ.14.54 కోట్లతో చేపట్టగా ఇప్పటికి 69 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 26,754 మీటర్ల రోడ్ల నిర్మాణం చేశారు.



నిర్మాణంలో ఉన్న మురుగు కాల్వలు





నిర్మాణ దశలో సీసీ రోడ్డు

6

పొరుగుసేవల ఉద్యోగులకు బదిలీల పోగ
- జాబితాలను సిద్ధం చేసిన ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయాలు

ఏఎన్‌యూ పీజీ పరీక్షల తేదీల్లో మార్పులు
- 1, 3 సెమిస్టర్ పరీక్షలకు మారిన షెడ్యూల్

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు
- 383 మంది హాజరు.. 238 మంది తదుపరి పరీక్షలకు ఎంపిక

ఆంధ్ర క్రికెట్ జట్టుకు బాపట్ల విద్యార్థి ఎంపిక

గౌరవం సరే.. వేతనం?

- గౌరవ వేతనం కోసం సర్పంచ్‌ల నిరీక్షణ
- నెలకు రూ.3 వేలు.. పది నెలలుగా పెండింగ్
- ముఖ్యమంత్రి ఆదేశాలను పట్టించుకోని అధికారులు



గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కడుపు చించుకుంటే కాళ్ల మీద పడినట్లుగా ప్రస్తుతం సర్పంచ్‌ల పరిస్థితి నెలకొంది. గత పది నెలలుగా గౌరవ వేతనం అందక గ్రామాల్లోని ప్రథమ పౌరులైన సర్పంచ్‌లు అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో తగిన గౌరవం దక్కుతుందన్న ఆనందం.. వేతనం అందలేదన్న బాధతో ఆవిరి అవుతుందని వాపోతున్నారు. తమ దగ్గర పనిచేసే ఉద్యోగులకు జీతాలు అందక పోతే వారితో, వీరితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నాం.. అదే తమకే వేతనం రాక పోతే ఎవరికి చెప్పుకోవాలని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి గౌరవం వేతనం బకాయి ఉంది. గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519, బాపట్ల జిల్లాలో 426 మంది సర్పంచ్‌లు ఉన్నారు. వారికి నెలకు ప్రభుత్వం గౌరవ వేతనం కింద రూ.3 వేల వరకు చెల్లిస్తుంది. గత ప్రభుత్వం ఈ మొత్తం చెల్లించేందుకు కూడా సర్పంచ్‌లను ముప్పతిప్పలు పెట్టిం ది. దానికోసం సర్పంచ్‌లు పలు సందర్భాల్లో రోడ్డెక్కాల్సి వచ్చింది. ఎన్నికల సమయంలో సర్పంచ్‌లు దూరం అవుతారన్న ఆలోచనతో అప్పటి వరకు ఉన్న బకాయిలను గత ఏడాది మార్చి నెలలో వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో వేతనాలు చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పరిపాలనా సంబంధిత వ్యవహారాల్లో సర్పంచ్‌లను కీలకమైన వారిగా ప్రకటించింది. గౌరవ వేతనం చెల్లింపులపై సీఎం చంద్రబాబు నాయు డు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. చాలా మంది సర్పంచ్‌ల రోజువారీ ఖర్చులకు ఆ గౌరవ వేతనమే ఆధారమని చెబుతున్నారు.

వినతిపత్రం కూడా ఇచ్చాం..

సర్పంచుల గౌరవ వేతనంపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ సంయుక్త కార్యదర్శి కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని ఇచ్చాం. తప్పకుండా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు క్రమం తప్పకుండా ప్రతి నెల నిధులు విడుదలకు కృషి చేయాలి.

- డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ముఖ్య సలహాదారు, ఏపీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం

వెంటనే విడుదల చేయాలి

పది నెలలుగా గౌరవ వేతనం రాకపోవడం బాధాకరం. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలి.

- మబ్బు శిరీష, సర్పంచ్, జొన్నలగడ్డ, గుంటూరు రూరల్

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- శాఖల వారీగా ఆకర్షణీయంగా శకటాలను ప్రదర్శించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో 26న గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గణ తంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్ తేజతో కలసి గురువారం కలెక్టరేట్‌లోని అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై శక టాలు రూపొందించి ప్రదర్శించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి శకటాలను ఆకర్షణీయంగా రూపొందించాలన్నారు. స్టాళ్లను కూడా మైదానంలో ఏర్పాటు చేయాలన్నారు. దేశ భక్తిని ప్రతిబింబించే విధంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు డీఈవో ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో షేక్.ఖజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పాల్గొన్న ఎస్పీ, జేసీ తదితరులు

3న స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నిక

- ఈ నెల 22 నుంచి నామినేషన్ల స్వీకరణ
- నోటిఫికేషన్ జారీ చేసిన నగరపాలక సంస్థ

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు ఫిబ్రవరి 3న జరుగుతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలను తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను నగరపాలక సంస్థ నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఈ నెల 22 నుంచి 24న మధ్యాహ్నం 3 గంటల వరకు కార్పొరేషన్‌లోని అదనపు కమిషనర్ చాంబర్‌లో నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. 27న స్క్రూట్నీ, అదేరోజు వ్యాలిడ్ నామినేషన్లను ప్రకటిస్తామన్నారు. 30న మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. ఫిబ్రవరి 3న ఉదయం 10.30 నుంచి 3 గంటల వరకు కౌన్సిల్ సమావేశ మందిరంలో ఓటింగ్ జరుగుతుందని ఆ తర్వాత లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతుందని కమిషనర్ తెలిపారు. సమావేశంలో ఏసీ చల్లా ఓబులేసు, డీసీలు డి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రటరి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధర.. దిగాలు



- మిర్చి క్వింటాల్ రూ.13 వేలు
- ఏడాదిగా మిర్చి ధరలు పతనం
- దిగుబడులున్నా పెట్టుబడి రాని దుస్థితి
- ఇప్పటికే కోల్డ్ స్టోరేజీల్లో లక్షల టిక్కీల నిల్వ
- 20వ తేదీ నుంచి యార్డులో కొనుగోళ్లు ప్రారంభం

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఘాటు ధరలో లోపించింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఏడాదిగా మిర్చి ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. ఒకప్పుడు మిర్చి పండించి లాభాలు గడించిన రైతులు ఆ సాగును వీడలేక.. ఎప్పటికైనా ధర పెరగకపోతుందా అని ఎదురుచూస్తున్నారు. అయితే ఏడాదిగా పరిస్థితిలో మార్పు రాకపోగా మరింతగా ధరలు దిగజారిపోతున్నాయి. గత ఏడాది జనవరి నుంచి ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాధారణంగా సీజన్ ఆరంభంలో మంచి ధర పలికే ఆనవాయితీ కూడా ఈసారి తప్పింది. ఎగుమతి ఆర్డర్లు తగ్గడం, ఆయా రాష్ట్రాల్లో కూడా వెరైటీలు బాగా పండడంతో మిర్చి ధర పతనం అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది గుంటూరు మిర్చి యార్డుకు తెచ్చిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు లక్షలాది టిక్కీలు కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేశారు. ఏడాది పొడవునా ఒకే ధర ఉండడంతో వాటిని మధ్యలో అమ్మే ప్రయత్నం చేయలేదు. ఈ క్రమంలో సోమవారం నుంచి గుంటూరు మిర్చి యార్డులో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ ఒక్కరోజే సుమారు 80 వేల టిక్కీలు అమ్మకానికి వస్తాయని యార్డు అధికారులు అంచనా వేస్తున్నారు. పాత పంట లక్షల టిక్కీలు పేరుకుని పోతే, కొత్త పంట ధర విషయంలో పెద్దగా డిమాండ్ ఉండకపోవచ్చని వ్యాపారులు అంటున్నారు. గుంటూరు మిర్చి యార్డులో ప్రస్తుతం కామన్ వెరైటీగా చెప్పే 334, నెంబరు 5,273, గుంటూరు సన్నం, సూపర్ 10,341 కనిష్ఠ ధర రూ.7 వేలు, గరిష్ఠ ధర రూ.19 వేలు ఉంది. అయితే రూ.13 వేలకు మించి కొనుగోలు జరగడం లేదు. స్పెషల్ వెరైటీగా చెప్పబడే తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ కనిష్ఠ ధర రూ.7500, గరిష్ఠ ధర రూ.20700 ఉండగా రూ.15 వేలకు మించి కొనుగోలు జరగడం లేదని సమాచారం.

తగ్గిన సాగు.. పెరిగిన పెట్టుబడి

గత ఏడాది పెద్దగా మిర్చికి ధర లేకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది మిర్చి

(మిగతా 6వ పేజీలో)



ఆంధ్ర క్రికెట్ జట్టుకు బాపట్ల విద్యార్థి ఎంపిక



అబ్దుల్ సాద్ ఉనైస్

బాపట్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అండర్ -14 ఆంధ్ర క్రికెట్ జట్టుకు బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్ ఎంపికయ్యారు. పలువురు క్రీడాకారులు, ప్రముఖులు విద్యార్థిని అభినందించారు. క్రీడారంగాన మరెన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -14 రాష్ట్ర టీమ్‌లో అబ్దుల్ సాద్‌కు అవకాశం దక్కటం అభినందనీయమని బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అబ్దుల్ సాద్ ఉనైస్ గతనెలలో జరిగిన అండర్ -14 జిల్లా స్థాయి ఎంపికలో తొలిసారిగా పాల్గొని గుంటూరు జిల్లా టీమ్‌లో ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యారు. కృష్ణా, చిత్తూరు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం, అనంతపూర్, విశాఖపట్నం జిల్లాల్లో జరిగిన పోటీలలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన అబ్దుల్ సాద్ రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. వివిధ జిల్లాలలో జరిగిన క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో విశేషమైన ప్రతిభ కనబరిచారు. ఉత్తమప్రతిభ కనబరిచిన 60మంది క్రీడాకారులలో అబ్దుల్ సాద్‌కు అవకాశం దక్కింది. చివరిగా విజయనగంలో జరిగిన జోనల్ పోటీలలో 17మందితో కూడిన ఆంధ్ర అండర్ -14 క్రికెట్ టీమ్ జట్టు ఎంపిక చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అబ్దుల్ సాద్‌ను తీర్చిదిద్దటంలో కృషి చేసిన కోచ్ అమీర్‌ను పలువురు అభినందించారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం జరిగిన అభినందన సభలో పలువురు క్రీడాకారులు పాల్గొని అబ్దుల్‌సాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దొప్పలపూడి రామ్మోహనరావు, బి.స్టానీల్, విమల్‌కుమార్, రవికుమార్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ డైరెక్టర్ అబ్దుల్ కరీం, అంబటి గిరిధర్, మిరియాల సుబ్బారావు, తూనుగుంట్ల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పొరుగుసేవల ఉద్యోగులకు బదిలీల పోగ

- కొత్త సర్కిల్ ఆఫీసులకు పంపేలా ఉత్తర్వులు
- జాబితాలను సిద్ధం చేసిన ఎస్ఈ కార్యాలయాలు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్) లిమిటెడ్ సంస్థలోని పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఏకంగా ఒక సర్కిల్ కార్యాలయం నుంచి కొత్త సర్కిల్ కార్యాలయాలకు బదిలీలు చేయాలన్న ఉత్తర్వులు వారిలో పిడుగుపాటుకు గురిచేస్తోంది. తాజాగా సీపీడీసీఎల్ సీఎండీ పటాన్‌శెట్టి రవి ఆదేశాలు ఉద్యోగుల్లో కలవరానికి గురిచేస్తోంది. బదిలీల ప్రక్రియను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సీపీడీసీఎల్ పరిధిలో ఉమ్మడి గుంటూరు సర్కిల్‌ను పల్నాడు సర్కిల్, బాపట్ల సర్కిల్‌గా విభజించిన విషయం తెలిసిందే. అటు కృష్ణా జిల్లాలోనూ మచిలీపట్నం కొత్త సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. కాగా గుంటూరు సర్కిల్‌ను కొత్తగా విభజించిన పల్నాడు, బాపట్ల సర్కిల్ కార్యాలయాలకు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇప్పటికే సర్కిల్స్‌కు ఎస్ఈలను, ఈఈలను నియమించిన యంత్రాంగంగా కొత్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పాత సర్కిల్ కార్యాలయాల నుంచి కొత్త సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రం గుంటూరు సర్కిల్ కార్యాలయంలో 31 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటే ఇందులో 17 మంది ఉద్యోగులను పల్నాడు సర్కిల్ కార్యాలయ కేంద్రం నరసరావుపేటకు బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఇప్పటికే సర్కిల్ కార్యాలయం యంత్రాంగం బదిలీ జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇక కొత్తగా ఏర్పడిన బాపట్ల సర్కిల్‌కు కూడా ఒంగోలు సర్కిల్ కార్యాలయం నుంచి ఉద్యోగులను బదిలీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దాంతో ఒంగోలు సర్కిల్ కార్యాలయంలో 33 మంది ఉద్యోగులు ఉంటే వారిలో 13 మందిని బాపట్లకు బదిలీ చేయాలని జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. విజయవాడ సర్కిల్ కార్యాలయంలో 20 మంది ఉద్యోగులు ఉంటే వారిలో 8 మందితో బదిలీ జాబితాలో చేర్చినట్లు ఆశాఖ వర్గాలు చెబుతున్నాయి.

చాలీచాలని జీతాలతో ఎలా..

అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బదిలీల జాబితాలో చేర్చటం అన్యాయమంటూ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి సాధారణ బదిలీల సమయాల్లో రెగ్యులర్ ఉద్యోగులకే బదిలీల ప్రక్రియ ఉంటుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీల విధానమే ఉండదని వారు గుర్తుచేస్తున్నారు. కనీసం ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి కాకుండా ఏకంగా సర్కిల్ కార్యాలయాల నుంచి మరో సర్కిల్ కార్యాలయానికి బదిలీలు చేయటాన్ని వారు ఆక్షేపిస్తున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తుంటే జిల్లాలు దాటి ప్రయాణాలు చేయాలంటే వచ్చే జీతంలో సగం జీతం చార్జీలకే సరిపోతాయని వారు వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు దశాబ్దాలుగా పనిచేస్తోన్నా కనీస జీతాలు కూడా రావటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా గుంటూరు సర్కిల్ కార్యాలయంలో బదిలీల జాబితాలో 70 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉండటం విశేషం. మహిళా ఉద్యోగులు అత్యధికశాతం ఉండటంతో ఏం చేయాలో తెలియక సర్కిల్ అధికారులు మల్లగుల్లాలు పడుతోన్నారు.

సీఆర్‌డీఏ సర్కిల్ ఆవిర్భావ సమయంలో ప్రక్రియ ఇలా..

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఉమ్మడి గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు-2 డివిజన్, అమరావతి డివిజన్‌లను కలిపి కొత్తగా సీఆర్‌డీఏ సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సర్కిల్ కార్యాలయంలో పనిచేసేందుకు ఉద్యోగుల కోసం కొత్తగా నియామకాలను చేపట్టారు. ఇలా వేరొక సర్కిల్ నుంచి ఉద్యోగుల బదిలీల వ్యవహారం లేదని గుర్తుచేస్తున్నారు. డివిజన్ కార్యాలయాల్లో ఉన్న వారిని సర్దుబాటు చేసుకొని సర్కిల్ కార్యాలయానికి కొత్తగా ఉద్యోగులను నియమించుకున్నారని, అటువంటి ప్రక్రియ వదిలేసి వేరొక జిల్లా నుంచి సిబ్బందిని బదిలీ చేయటం సరికాదని ఆక్షేపిస్తున్నారు.

ఉత్కంఠభరితంగా మంగళగిరి ప్రీమియర్ లీగ్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నవులూరులోని అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఐదో రోజైన గురువారం మంగళగిరి-పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పశ్చిమ గోదావరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మంగళగిరి జట్టు 102 పరుగులకే ఆలౌటయింది. రక్షణ్ 47 బంతుల్లో 87 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తూర్పు గోదావరి-కృష్ణా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ టైగా ముగియడంతో సూపర్ ఓవర్‌తో ఫలితాన్ని తేల్చారు. కృష్ణా జిల్లా జట్టుపై 3 పరుగుల తేడాతో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. 33 బంతుల్లో 53 పరుగులు చేసిన జయంత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. ఈ పోటీలకు సేల్, సక్కు, ఉషోదయ, మర్క్యూరోస్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

ధర.. దిగాలు

(5వ పేజీ తరువాయి)

సాగు తగ్గింది. గత ఏడాది 2,37,398 హెక్టార్లలో మిర్చి సాగు కాగా, ఈ ఏడాది కేవలం 1,45,713 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. కొన్ని తెగుళ్ల వచ్చినప్పటికీ ప్రస్తుతం పంట బాగానే ఉన్నది. దిగుబడి కూడా పెరుగుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. మిర్చి సాగు పెట్టుబడి ఏటేటా పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ2.30 లక్షలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు 20 క్వింటాల్ దిగుబడి వస్తుందన్న అంచనాలో రైతులు ఉన్నారు. పూర్తిస్థాయిలో పంట చేతికి వచ్చేప్పటికి ఇదే ధరలు కొనసాగినా రైతులకు పెద్ద నష్టం వాటిల్లదు. కానీ ఒక వేళ ధరలు మరింత పతనమైతే మాత్రం ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు నష్టం వస్తుందన్న అంచనాలున్నాయి.

తెలంగాణలోనూ సాగు..

గుంటూరు జిల్లాలో పండించే తేజ వెరైటీకే ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంటోంది. ఘాటు ఎక్కువగా ఇష్టపడే ముస్లిం దేశాలకు, దక్షిణ చైనాకి గుంటూరు మిర్చి ఎగుమతి అవుతుంది. గుంటూరు జిల్లాలో పండిస్తున్న తేజ వెరైటీలో ఘాటు 70 వేల నుంచి 80 వేల యూనిట్స్ వరకు ఉంటుంది. ఈ రకం ఎక్కువగా పండించేందుకు ఈ నేల అనువుగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వచ్చేది. అయితే నాలుగేళ్లుగా ఇదే పంటను తెలంగాణలో కూడా సాగు చేస్తున్నారు. ఖమ్మం, మధిర ప్రాంతాల్లో పండుతున్న మిర్చిని ఎక్కువగా బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తున్నారు. దీంతో గుంటూరు యార్డు నుంచి ఆర్డర్లు తగ్గాయి. అంతర్జాతీయగా కూడా మిర్చి సాగు పెరిగిందని ఈ క్రమంలో ధరలు పతనమవుతున్నట్లు తెలుస్తోంది.

యువ క్రికెటర్ నితీష్‌కు మంత్రి లోకేశ్ అభినందన



నితీష్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన తెలుగు క్రికెటర్ నితీష్ కుమార్‌రెడ్డిని మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఉండవల్లి కరకట్ట వెంబడి వున్న నివాసంలో గురువారం రాత్రి నితీష్‌కుమార్‌రెడ్డి మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలుగువాడి సత్తా చాటిన నితీష్‌ను మంత్రి లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలో యువ ఔత్సాహిక క్రీడాకారులకు నితీష్ స్ఫూర్తిగా నిలిచారని లోకేశ్ ఈ సందర్భంగా అన్నారు. అనంతరం ఆయన నితీష్‌ను చేనేత శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా నితీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్పోర్ట్స్ పాలసీ చాలా బాగుందని చెప్పారు. ఈ పాలసీలో క్రికెట్‌ను కూడా చేర్చి యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. నితీష్ ఈ సూచనపై లోకేశ్ సానుకూలంగా స్పందించారు. నితీష్ వెంట ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కలెక్షన్ మేనేజర్ మృతి



వెంకట రాజేష్(ఫైల్)

నాదెండ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు - కర్నూలు రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌బీఐ కలెక్షన్ మేనేజరుగా పని చేస్తున్న మన్నెం వెంకట రాజేష్(47) మృతి చెందాడు. నాదెండ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నగరంలోని వెంగయ్య నగర్ 3వ లైన్‌కు చెందిన మన్నెం వెంకట రాజేష్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కలెక్షన్ మేనేజరుగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా క్రెడిట్ కార్డు ఏజెన్సీ టీమ్ లీడరుగా పని చేస్తున్న నవీన్‌తో కలిసి బ్యాంక్ పనుల నిమిత్తం మోటారు బైక్‌పై గుంటూరు బయలుదేరారు. నవీన్ వాహనం నడుపుతుండగా వెంకట రాజేష్ వెనుక కూర్చున్నాడు. సాతులూరు గ్రామ పరిధిలోని హోసన్న ప్రార్థనా మందిరం సమీపంలోకి వచ్చేటప్పటికీ వారి ద్విచక్ర వాహనానికి గేదె అడ్డం వచ్చింది. గేదెను తప్పించేందుకు వాహనాన్ని పక్కకు తిప్పగా గుంటూరు నుంచి నరసరావుపేట వైపునకు వెళ్లే కారు వెనుక నుంచి వారి వాహనాన్ని ఢీకొట్టింది. కొంత దూరం వారి వాహనాన్ని కారు ఈడ్చుకు పోయింది. వెనుక కూర్చున్న వెంకట రాజేష్ తీవ్రంగా గాయ పడ్డాడు. చికిత్స కోసం నరసరావుపేట తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రాజేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మేనల్లుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

- ప్రతి ఒక్కరూ వాటిని అనుసరించాల్సిందే
- తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు



చంద్రశేఖర స్వామి ఆలయాన్ని దర్శించిన తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

పెదకాకాని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి అని తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తెలిపారు. గత నాలుగు రోజులుగా తక్కెళ్ళపాడులో జరుగుతున్న శ్రీచంద్రశేఖర స్వామి ఆర్ద్ర మహోత్సవంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తొలుత చంద్రశేఖర స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో తెలుగువారి గొప్పదనం, విశిష్టతను అనేకమంది ఆయా దేశాలలో ఉన్న ప్రజలు అనుసరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాల లోపంతోనే ఆలయాల అభివృద్ధి జరగడం లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కూరెళ్ల వెంకట చంద్రశేఖర్ ప్రసాద్, ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షల్లో గురువారం 238 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. 383 మంది హాజరవ్వగా, వారిలో 23 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 306 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మంది ఛాతీ, ఎత్తు తదితర కొలతలు సరిపోలేదు. మిగిలిన 283 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 41 మంది విఫలమయ్యారు. 242 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. ఒకరు పరుగు పోటీల్లో పాల్గొనలేదు. దీంతో 241 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 147 మంది అర్హత సాధించగా 95 మంది విఫలమయ్యారు. కాగా 242 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 236 మంది అర్హత సాధించగా 12 మంది విఫలమయ్యారు. మొత్తం 306 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 238 మంది అర్హత సాధించగా, 68 మంది విఫలమయ్యారు. పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి, హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్



మాట్లాడుతున్న జైళ్ల శాఖ జిల్లా అధికారి వీరేంద్రప్రసాద్

గురజాలటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్‌ను గురువారం జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జైలులోనే గడిపారు. కాగా జైళ్ల శాఖ జిల్లా అధికారి వీరేంద్రప్రసాద్ సబ్‌జైలు నుంచి బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సబ్‌జైల్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. జైల్‌లో సెల్‌ఫోన్ వినియోగిస్తున్నారని విలేకరులు అడుగగా అటువంటిదేమీ లేదని, అదంతా అవాస్తమని వీరేంద్రప్రసాద్ తెలిపారు.

ఏఎన్‌యూ పీజీ పరీక్షల తేదీల్లో మార్పులు

- 1, 3 సెమిస్టర్ పరీక్షలకు మారిన షెడ్యూల్
- పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు

పెదకాకాని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ, ప్రొఫెషనల్ కోర్సులకు నిర్వహించే పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు గురువారం తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఆర్ట్స్ కోర్సులు, సైన్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ కోర్సులకు మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా, ఫిబ్రవరి 11వ తేదీ నుంచి జరుగుతాయని వెల్లడించారు. అలాగే ఈ నెల 27వ తేదీ నుంచి జరగాల్సిన 1వ సెమిస్టర్ ఆర్ట్స్, సైన్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ పరీక్షలు ఫిబ్రవరి 13వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయని తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ తేదీల్లో యూజీసీ నెట్ పరీక్ష ఉండటంతో వీసీ ఆచార్య కె.గంగాధర రావు ఆదేశాల మేరకు మూడో సెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పులు చేశామని వివరించారు. మూడో సెమిస్టర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ సమాచారాన్ని ఆయా కళాశాలలకు కూడా పంపుతున్నామని అలాగే యూనివర్సిటీ వెబ్సైట్ లో పొందుపరిచినట్లు వివరించారు.

ఏసు బోధనలు ప్రపంచ శాంతికి మార్గం



తురకపాలెంలో జేసు తిరు హృదయ స్వరూప ప్రతిష్ఠ చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ముప్పాళ్ళ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏసు బోధనలు ప్రపంచ శాంతికి మార్గాలని గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో జేసు తిరు హృదయ స్వరూప ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం జరిగింది. బిషప్ భాగ్యయ్య విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దివ్య పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థల దాత, గ్రామ సర్పంచి మల్లవరపు చంద్రశేఖర్, స్వరూప దాత మద్దినేని శౌరయ్య, స్థానిక విచారణ గురువు ఫాదర్ ఎస్.చిన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసవత్తరంగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలు



తలపడుతున్న తమిళనాడు-పంజాబ్

ఈపూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కబడ్డీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు గురువారం రసవత్తరంగా సాగాయి. మొత్తం 50 జట్లు పాల్గొనగా లీగ్ దశకు పది జట్లు వచ్చాయి. లీగ్ దశలో పంజాబ్‌పైన తమిళనాడు, సత్తెనపల్లిపై కర్ణాటక, జీవీ యువసేనపై ఏపీ స్పై, ఝార్ఖండ్‌పై పంజాబ్, హర్యానాపై ఝార్ఖండ్ విజయం సాధించినట్లు కమిటీ నిర్వాహకులు సూరే కోటేశ్వరరావు, తల్లపనేని రామారావు తెలిపారు. శుక్రవారంతో పోటీలు ముగుస్తాయన్నారు.

ప్రేమ పేరుతో యువతిని వంచించిన వైసీపీ కార్యకర్త

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుకు చెందిన వైసీపీ కార్యకర్త ప్రేమ పేరుతో ఓ యువతిని వంచించాడు. ఈ అవమాన భారం తట్టుకోలేక ఆ యువతి ఎలుకలు మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆ యువతి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు.. ప్రత్తిపాడు తూర్పుపాలెంకు చెందిన కారసాల రాజారావు, అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నారు. పెళ్లి విషయమై ఆమె ఈనెల 15న రాజారావును నిలదీసింది. దీంతో రాజారావు నిన్ను పెళ్లి చేసుకోనని, చేతనైంది చేసుకోమని బెదిరించాడు. దీంతో బాధిత యువతి ఎలుకల మందు తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్ కు తరలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 562.40 అడుగులు ఉంది. ఇది 238.00 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 8550 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 280, ఔట్‌ఫ్లో వాటర్‌గా 28,466 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138,147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

షుగర్, థైరాయిడ్ వ్యాధులపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని కార్యాలయంలో ఈ నెల 19న షుగర్, బీపీ, థైరాయిడ్ వ్యాధులపై ఆరోగ్యసభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ నంది పాటి వెంకటసందీప్ ముఖ్యవక్తగా హాజరై అవగాహన కల్పిస్తారన్నారు. ముఖ్యంగా షుగర్, బీపీలతో పాటు అధిక బరువు, థైరాయిడ్ ప్రాబ్లమ్స్, ఆస్టిమో పోరోసిస్ కాల్షియమ్ సమస్యలపై అవగాహన, సందేహాలు నివృతి చేస్తారన్నారు.

కవి, రచయిత కుమార్‌రాజుకు 'తెలుగు కీర్తి' పురస్కారం



గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడు, కవి, రచయిత, జిల్లా రచయితల సంఘం ప్రతినిధి, శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికైనట్లు శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి తెలి పారు. ఈ నెల 21న విజయవాడలోని కౌతా పూర్ణా నంద విలాస్ కళావేదికలో ఈ పుర స్కార కార్యక్రమం జరుగుతుందని కుమార్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ రాజు మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక పుర స్కారానికి తనను ఎంపిక చేసినందుకు ప్రతాప్‌కు, రమావతి, జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం, పార్థసారధి తదితరులకు తన కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

వైసీపీ కిరాయిమూకల ఆశలు ఫలించలేదు: కనపర్తి

గుంటూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతో యుద్ధం చేసి అలసి పోవాల్సిందే తప్ప ఆయన ఓడిపోడన్న విషయాన్ని వైసీపీ దొంగల ముఠా నాయకులు వైఎస్ జగన్మోహనరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి తెలుసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 క్లైమోర్ మైన్లు పెట్టి పేల్చి చంపాలని చూసినా మృత్యుంజయుడిలా చంద్రబాబు నడిచొచ్చిన విషయాన్ని వారు మర్చిపోకూడ దన్నారు. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని విలేకరి ముసుగులో దొంగల ముఠా నాయకులు చేసిన ప్రయత్నాలు సుప్రీంకోర్టులో ఫలించలేదన్నారు.

వైసీపీ సోషల్ మీడియా సైకోలకు మద్దతుగా జర్నలిస్టు ముసుగులో ఆర్టీఐ మాజీ కమీషనర్ విజయ బాబు వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో హైకోర్టు చీవాట్లు పెట్టడమేకాక యాభై వేలు జరిమానా విధించినా వారికి సిగ్గు రాలేదని ఘాటు విమర్శలు చేశారు. పులివెందుల మేజిస్ట్రేట్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు చంద్రబాబుపై వైఎస్ కుటుంబం వేయని కేసు లేదని, విజ యమ్మకు సుప్రీంకోర్టు సైతం చీవాట్లు పెట్టిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. జగన్ లాంటి నేర మనస్తత్వం కలిగిన నాయకుడు రాజకీయాల్లో ఉండడం ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదమని అన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనకు పీఎం ఇంటర్న్‌షిప్

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పీఎం ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంను ప్రారంభించినట్లు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. అంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పీఎం ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంపై రూపొందించిన పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జేసీ ఏ భార్గవ్ తేజతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఐఐఐ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీ ఫార్మసీ, బీబీఏ, బీటెక్ డిగ్రీ ఉన్న వారు, 21-24 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు అప్లై చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి వన్ టైమ్ ఇనిసెంటివ్ గ్రాంట్ రూ. 6000, భారత ప్రభుత్వం ద్వారా నెల వారి సహాయం రూ. 4,500, పరిశ్రమలు ద్వారా రూ.500 ఏడాది పాటు అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంటుం దని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న 'పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన', 'పీఎం సురక్షా బీమా యోజన' వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21 లోపు https://mca.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం ఏపీ ఎస్ఎస్‌డీసీ కమాండ్ కంట్రోల్ :+91- 998853335, 8712655686, 8790118349, 8790117279, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జీవీఎస్ సాయికుమార్‌ను 8074597926 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ షేక్ ఖజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి , డ్వామా పీడీ శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ , డీఈఓ రేణుక, డీఎస్ ఓ కోమలి పద్మ, జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, డీడీ మైన్స్ అండ్ జియాలజీ డి. శ్రీ వెంకట సాయి, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వీరాచారి పాల్గొన్నారు.



పీఎం ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జే సీ, రవాణా శాఖ అధికారులు

రహదారి భద్రత ప్రతీఒక్కరి బాధ్యత


గుంటూరు(తూర్పు), జనవరి 16(ఆంధ్రజ్యోతి): రహదారి నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించి రూపొందించిన బ్రోచర్లు, కరపత్రాలను జేసీ భార్గవ్ తేజతో కలసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై కళాశాల, పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం, ఇతర వాహనదారులు సీట్ బెల్టు ధరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డీటీసీ కే సీతారామిరెడ్డి మాట్లాడుతూ గురువారం నుంచి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులు, విద్యార్థులకు వ్యాస రచన, ఇతర పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్టీవో సత్యనారాయణ, మోటారు వాహన తనిఖీ అధికారులు గోపాల్, మల్లీశ్వరీ పాల్గొన్నారు.

జాబ్ చార్టు యాప్‌తో జవాబుదారీతనం



జాబ్‌చార్ట్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు విధుల్లో జవాబుదారీతనం, సమర్థత కోసం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు సమగ్ర విధినిర్వహణ ప్రణాళిక (జాబ్ చార్ట్) యాప్‌ను రూపొందించారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రామ/వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ యాప్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసుల దైనందిన విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ యాప్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు మహిళలు, చిన్నారుల సంరక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం వంటివివిధ అంశాలకు సంబంధిం చిన సమగ్ర సమాచారాన్ని స్థానిక పోలీస్ అధికారులకు అందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మహిళా పోలీసులు కృషి చేయాలని అన్నారు. ప్రతి ఒక్క గ్రామ, వార్డు మహిళా పోలీసు ఈ జాబ్ చార్టును పాటించి ఏరోజు ఇచ్చిన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అదే రోజు మహిళా పోలీస్ జాబ్ చార్టు యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు, జిల్లా సాంకేతిక విభాగం సీఐ నిస్సార్ భాషా, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుల్ ఇమామ్ సాహెబ్, మానస, యాసిన్ పాల్గొన్నారు.



ఉరుసు మహోత్సవాలకు సిద్ధంగా ఉన్న హజరత్ కాలే మస్తాన్‌షా దర్గా

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు) జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా 133వ ఉరుసు మహోత్సవాలు శుక్ర వారం నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. దర్గా ఆవ రణలో ఉత్సవాలకు సంబధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. వివరాలను వెల్ల డించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బాబా సమాధిపై నూతన చాందిని అలంకరణ, రాత్రి గంధం ఊరేగింపు, 18న గంధం పంపిణీ, దీపారాధన, 19న ఖురాన్ పఠనం, బాబా ప్రసాదం పంపిణీ, 20న ఫకీర్లకు బాబా శేష వస్త్రాల పంపిణీ, 21న బాబా ఆసీనులైన కుర్చీని యథా స్థానంలో ఉంచడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. వీటితో పాటు విశేషపూజలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వివరించారు.

21 వరకు ట్రాఫిక్ దారి మళ్లింపు

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం నుంచి నగరంలో ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ తెలిపారు. ఈ ఆంక్షలు నేటి నుంచి 21వ తేదీ వరకు అమలులో ఉంటాయని , ట్రాఫిక్ ఆంక్షలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ ఉత్సవాల సందర్భంగా చుట్టుగుంట వైపు నుంచి ఎంటీబీ సెంటర్ (రమేష్ హాస్పిటల్ రింగ్) వైపునకు వచ్చు నాలుగు చక్రాల వాహనాలు, అంత కంటే పెద్ద వాహనాలు ఐటీసీ కంపెనీ, నగరంపాలెం పోలీస్‌స్టేషన్, ఎస్‌టీఐ సెంటర్, ఎంటీబీ సెంటర్ మీదుగా వెళ్లాలని సూచించారు. అదేవిధంగా చుట్టుగుంట వైపు నుంచి ఎంటీబి సెంటర్(రమేష్ హాస్పిటల్ రింగ్) వైపునకు వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు (3 వీలర్) చెక్కల బజారు, నగరంపాలెం మూడు బొమ్మలు సెంటర్, ఎంటీబీ సెంటర్ మీదుగా వెళ్లాలని సూచించారు. నగరంలో నుంచి చుట్టుగుంట వైపు వెళ్లే వాహనాలు యథావిధిగా వెళ్ళవచ్చని అన్నారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 204 మందికి రూ. 7.55 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ కేవీఎల్ఎన్‌మూర్తి నేతృత్వంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 59 మంది అధికారులు, 177 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఈ (డీపీఈ) సీహెచ్ వెంకటేశ్వరరావు, తెనాలి డివిజన్ ఆపరేషన్‌వీవీ చిరంజీవి ఆధ్వర్యంలో 5277 సర్వీసులు తనిఖీ చేశారని పేర్కొన్నారు. నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, ఇతర కేటగిరీల్లో, అదనపు లోడ్‌తో వినియోగించడంపై 204 మందికి 7.55 లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812361 నంబ ర్లలో ఫిర్యాదు చేయాలని కోరారు. తనఖీలలో డిప్యూటీ ఈఈలు ఎస్.మల్లికార్జున ప్రసాద్, ఏఈలు ఎమ్ సతీష్‌కుమార్, యూ శివశంకర్, ఆపరేషన్ ఏఈ పీవీ సుధీర్ ఉన్నారు.



పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ -2025 డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్ఈ బ్రహ్మయ్య

పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం డైరీ ఆవిష్కరణ

గుంటూరు సిటీ,జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ -2025 డైరీని ఎస్ఈ జీ బ్రహ్మయ్య గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఇంజనీర్లు కొత్త సంవత్సరం లో నూతన ప్రణాళికలతో ముందుకు సాగాలని అన్నారు. సానుకూల దృక్పథం అలవర్చుకోవాలని అన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నాణ్యమైన విధానంలో నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎన్ ఎస్ ప్రసాద్, జిల్లా ప్రెసిడెంట్ ఎస్ కె ఎం ఆర్ అన్సారీ, కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, ట్రెజరర్ జి శ్రీనివాసరావు,వైస్ ప్రెసిడెంట్ వఈ వెంకటరత్నం, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీఎంఏ హరి నారాయణ, పక్కన కమిషనర్ శ్రీనివాసులు

ఘన వ్యర్థాల నిర్వహణ ప్రణాళిక బద్ధంగా చేపట్టాలి

● డీఎంఏ హరి నారాయణ

గుంటూరు కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టి నప్పుడే రోజువారి ఉత్పత్తి అవు తున్న వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర పురపాలన సంచా లకులు(డీఎంఏ) హరి నారాయణన్ అన్నారు. నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ లతో కలిసి గురువారం ఆయన పరి శీలించారు. తొలుత జిందాల్ ప్రతినిధులతో ప్లాంట్ సామర్థ్యం, అవసరమైన వ్యర్థాలు, ఏ మున్సిపాల్టీ నుంచి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర వివరాలను డీఎంఏ అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్‌లోని టిప్పింగ్ ఫ్లోర్, గ్రాప్ కం ట్రోల్ రూమ్, బాయిలర్ 25 మీటర్, నెస్ట్ టిప్పింగ్ ఫ్లోర్, బాయిలర్ 8 మీటర్, ఇన్సరేటర్, డిసిఎస్ కంట్రోల్ రూమ్, టీజీ హాల్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా ఉందని, ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను ఒకే చోట డంప్ చేయడం ద్వారా స్థలాభావ సమస్య కూడా ఎదురవుతోందన్నారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ద్వారా వ్యర్థాల నిర్వ హణ, వ్యర్థాల ద్వారా విద్యుత్ తయారీ ద్వారా సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుంద న్నారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్ట్ ఏపీ ప్రెసిడెంట్ ఎంవీచారి, ఎస్ఈ నాగ మల్లే శ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం,ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ సతీష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నూరు శాతం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ

గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు పిన్ పాయింట్ మేరకు నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక గోరంట్ల, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్డు, నగరాలు లోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించిన కమిషనర్, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో నూరు శాతం పారిశుధ్య పనులు జరిగేలా బాధ్యత వహించాలన్నారు. ఉదయం ఇంటింటి చెత్త సేకరణ అనంతరం మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా డ్రైన్లలో పూడికతీత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్ల పక్కన డెబ్రిస్ లేకుండా అవసరమైతే ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరావృద్ధిలో సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం ముఖ్యం

గుంటూరు నగరాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం ముఖ్యమని, అభి వృద్ధి పనులపై తమ విలువైన అభిప్రాయాలు, సూచనలు అందించేందుకు శుక్ర వారం సాయంత్రం నాలుగు గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజన్-2047లో గుంటూరు నగరాభివృద్ధికి చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టుల విషయాలపై సూచనలు, సలహాలు అందించేందుకు ఈ ప్రత్యేక సమావేశానికి సీనియర్ సిటిజెన్స్ హాజరుకావాలని కోరారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ ఉన్నతాధికారి వీ మెహతా

త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో 178వ శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథి ఇన్‌కమ్ ట్యాక్స్ ఉన్నతాధికారి వీ మెహతా ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాలకు ఆత్మీయ అతిథిగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ గబ్బిట శివరామకృష్ణ ప్రసాదు హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన త్యాగరాజు కీర్తనలు, కచేరీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎస్. గిరిజాశంకర్ పర్యవేక్షించారు.

అలరించిన కర్ణాటక గాత్ర సంగీత కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న లంకా తేజస్విని

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బృందా వన్ గార్డెన్స్ లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్న మయ్య కళా వేదికపై గురువారం డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర సంగీత కచేరి జరిగింది. తొలుత ఆలయ కమిటి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడకు చెందిన లంకా తేజస్విని గాత్రధారణలో తొలుత హంసధ్వని రాగం, ఆదితాళంలో 'వాతాపి గణపతిం భజే'తో ప్రారంభించారు. అనంతరం పలు వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించింది. కర్ణాటక గాత్ర కచేరి ఆహ్లాదకరంగా సాగింది. వయోలిన్‌పై కుమారి ఏ కామాక్షి, మృదంగంపై కే అరవింద్ వాయిద్య సహకారం అందించారు.



పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి సంక్షేమ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజకు వినతిపత్రం అందజేస్తున్న పాపారావు, వీరాంజనేయులు తదితరులు

పంచాయతీల సర్‌చార్జీల విడుదలకు విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ చెల్లించాల్సిన సర్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్ర ప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధులు కోరారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంక్షేమ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజను గురువారం కలిసి ఈ మేరకు ఆయనకు విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్ చార్జీలు విడుదల చేయకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతి నిధులు చేసిన విజ్ఞప్తిపై స్పందించిన పంచాయతీ రాజ్ కమిషనర్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కడప జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, సురేష్ వర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చేరుకున్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా క్యాడెట్లు

ఎన్‌సీసీ మహిళా క్యాడెట్ల ట్రెక్కింగ్

గుంటూరు (విద్య)జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ 10 ఆంధ్ర గర్ల్స్ ఆధ్వర్యంలో నగరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు మొదటిసారిగా ట్రెక్కింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కర్నాల్ ఎస్ ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. 'అఖిల భారత మహిళ' పేరుతో ఈ నెల 16 నుంచి 23 వరకు జరిగే ఈ శిబిరంలో కొండవీడుకొండ, ఫిరంగిపురం కొండ, కోటప్ప కొండల్లో ట్రెక్కింగ్ చేస్తారని పేర్కొన్నారు. పక్షుల కేంద్రంతో పాటు ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాలను వీరు సందర్శిస్తారని పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణలోని 9 ఎన్‌సీసీ గ్రూపులకు చెందిన సుమారుగా 600 మంది ఈ ట్రెక్కింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని క్యాడెట్లు, శిబిరానికి వేదిక అయిన స్థానిక పభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు గురువారం చేరుకున్నట్లు చెప్పారు.

క్షీర విప్లవం.. పరిఢవిల్లుతున్న పాడిపరిశ్రమ

● ప్రతిరోజూ 4.89 లక్షల లీటర్ల ఉత్పత్తి ● పశు కిసాన్ క్రెడిట్ కార్డులతో మరింత భరోసా ● రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు పావలా వడ్డీకే రుణం

గుంటూరు సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో క్షీర విప్లవం మొదలైంది. ఒకప్పుడు పాల కోసం పక్క ప్రాంతాలపై ఆధారపడిన జిల్లాలో ఇప్పుడు అధిక ఉత్పత్తి జరుగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గత కొన్ని నెలలుగా జిల్లాలో పాల ఉత్పత్తిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక అవసరాలకు మించి పాలు ఉత్పత్తి అవుతుండటం గ్రామీణాభివృద్ధికి శుభ సూచికమని పశుసంవర్థక శాఖ జేడీ ఓ నరసింహారావు చెబుతున్నారు.

పంటలు దెబ్బతింటే గ్రామీణ ప్రాంతాన్ని ఆదుకుని అన్నం పెట్టేది పాడిపరిశ్రమేనని అంటున్నారు. జిల్లాలో 17.16 లక్షల మంది నివసిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. భారత వైద్య పరి శోధనా మండలి లెక్క ప్రకారం ప్రతి రోజు ఒక్కో మనిషికి 2.65 మిల్లీ లీటర్ల పాలు అవసరం. ఈ లెక్కన జిల్లాకు రోజుకు 4.54 లక్షల లీటర్ల పాలు అవ సరం అవుతాయి. అయితే, జిల్లాలో ఆవులు 16,899, గేదెలు 1,98,009 ఉన్నాయి. వీటిలో పాలిచ్చే ఆవులు, గేదెలు 81,558.ఆవులు రోజుకు 5 లీటర్ల వరకు పాలిస్తుండగా, గేదెలు రోజుకు 6 లీటర్ల వరకు పాలిస్తున్నాయి. జిల్లాలో పాలిచ్చే ఆవులు, గేదెలు వల్ల రోజుకు 4,89,348 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. అంటే, అవసరం కన్నా ఎక్కువ ఉత్పత్తి అవుతోంది.

ఎక్కువ వినియోగం నగరంలోనే

జిల్లాలో ఉత్పత్తి అవుతున్న మొత్తం పాలల్లో ఎక్కువ భాగం గుంటూరు నగరంలోనే వినియోగంలోకి వస్తున్నాయి. ఇక్కడ పాల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతిరోజు గ్రామాల నుంచి ఆయా వాహనాల ద్వారా పాలను నగరానికి తీసుకవచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. మొత్తం ఉత్పత్తి అవుతున్న పాలలో సగ భాగం గుంటూరు అవసరాలకు సరిపోతోంది.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టడంతో పాల విప్లవం పరిఢవిల్లుతోంది. జిల్లాలో పాడి పరిశ్రమ రైతులకు పశుసంవర్థక శాఖ పీఎం పశు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తుంది. వీటివల్ల రైతుకు ఆయా జాతీయ బ్యాంకు ల నుంచి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు వడ్డీలేని రుణం అందుతుంది. ఈ మొత్తాన్ని రైతులు దాణా కోసం, షెడ్డు నిర్మాణం కోసం వినియోగించుకోవాలి. జిల్లాలో ఇప్పటివరకు 7973 మందికి ఈ కార్డులు అందజేశారు. ఎంతమంది ఉన్నా కార్డులు అందజేసేందుకు ఈ శాఖ సిద్ధంగా ఉంది.

రోజు వారీ లాభం

పాడి పశువుల వల్ల రైతుకు రోజువారీ లాభం దక్కుతుంది. ఒక గేదె ఉన్న వాళ్ళకి కూలీ వారా నగదు మిగులుతుంది. అదే, రెండు, మూడు పాలిచ్చే పశువులు ఉంటే ఇంకా ఎక్కువగానే లాభం చేకూరుతుంది.

రైతు ఉత్పత్తి దారుల సంఘం ఉంటే మేలు

ఓ నరసింహారావు, జిల్లా పశుసంవర్థక అధికారి,గుంటూరు



పాడిపరిశ్రమ చాలా లాభదాయకంగా ఉంటుంది. రైతులు ఒక పాల ఉత్పత్తి దారుల సంఘం ఏర్పడితే మరిన్ని లాభాలు వస్తాయి.ఒక గ్రామంలో రైతులు పాల ఉత్పత్తి దారుల సంఘంగా ఏర్పడి రోజుకి వెయ్యి లీటర్ల నుంచి 1500 లీటర్ల వరకు పాలు ఉత్పత్తి చేయగలిగితే వాటి ద్వారా కోవా, లస్సీపన్నీరు, పెరుగు,నెయ్యి వంటి వాటిని తయారు చేయవచ్చు. పాల ఉత్పత్తుల అమ్మకం వలన లాభాలు ఎక్కువగా వస్తాయి.అటువంటి సంఘాలకు సరైన సలహాలు సూచనలు ఇచ్చేందుకు మేము ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
గుంటూరు ● శుక్రవారం 17 జనవరి 2025

సినిమాలో నా లుక్ తృప్తినిచ్చింది

- జగపతిబాబు



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్). నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. జగపతిబాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో తన లుక్ గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే సినిమా కోసం సన్నద్ధమవుతున్న వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "చాలా కాలం తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా 'ఆర్‌సీ 16' కోసం మంచి పాత్రను ఇచ్చాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా ఉంది" అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.






షాక్‌కు గురయ్యాం

సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడిపై టాలీవుడ్ హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసి షాక్‌కు గురయ్యామన్నారు. 'సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి నన్నెంతగానో కలచి వేసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'సైఫ్ సర్‌పై జరిగిన దాడి గురించి విని షాక్‌కు గురయ్యాను. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా' అంటూ జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. కాగా, ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రంలో విలన్ పాత్ర పోషించారు సైఫ్ అలీఖాన్. గతేడాది విడుదలైన ఈ మూవీకి సీక్వెల్‌గా 'దేవర-2' ప్రారంభం కావాల్సి ఉంది. సైఫ్ దాడికి గురికావడంతో ఇది మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

అందుకే సినిమాలు తగ్గించా

బ్రహ్మానందం



"సినిమాలు ఎందుకు తగ్గించేశానని చాలా మంది అడుగుతున్నారు. నాకు మంచి ఇమేజ్ ఉంది. దాన్ని కాపాడుకోవాలి. బ్రహ్మానందం బాగానే చేస్తున్నాడు కానీ.. ఒకప్పటిలా బాగా నవ్వించలేకపోతున్నాడు. ఆయన ఒకప్పుడు నటిస్తే వచ్చినంత నవ్వు ఇప్పుడు రావట్లేదు' అని కొందరు కమెడియన్లు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఎంత జాగ్రత్తగా చేసినా ఇలా దొరికిపోతుంటాం. ఇలాంటివి అనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే సినిమాలు సెలక్టివ్‌గా చేస్తున్నాను. దర్శకులు కూడా నేను ఇదివరకు చేసిన పాత్రలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. నన్ను ప్రేక్షకులు ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోవాలంటే రిపీట్ పాత్రలు చేయకూడదు. మరో కారణం, పెరుగుతున్న నా వయసు. ఒకప్పుడు చేసినంత ఉత్సాహంగా చేయలేకపోతున్నాను. అందుకే సినిమాలు తగ్గించేయాలని నిర్ణయం తీసుకున్నాను. నాకు సినిమాల్లో అవకాశాలు రాకా కాదు. దర్శకులు నాకు పాత్రలు ఇవ్వకా కాదు. నేను యాక్టింగ్ చేయలేకా కాదు" అని 'బ్రహ్మా ఆనందం' టీజర్ లాంచ్ కార్యక్రమంలో బ్రహ్మానందం చెప్పారు. తన తనయుడు రాజా గౌతమ్‌తో కలసి ఆయన నటించిన చిత్రమిది. ఆర్.వీ.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్‌యాదవ్ నక్కిన నిర్మించారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.



నిజ జీవిత ఘటనల ఆధారంగా...

అక్షయ్ హీరోగా దినేశ్ బాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'డియర్ కృష్ణ'. మమిత బైజు, ఐశ్వర్య కీలకపాత్రల్లో నటించారు. పి.ఎస్.బలరామ్ నిర్మాత. జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ప్రతీ షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది' అని అన్నారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం' అని అన్నారు. కాగా, మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ని ఎంపిక చేసి రూ.10,000 క్యాష్ బాక్ బహుమతిగా అందించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

సంక్రాంతి సినిమా ఫిబ్రవరిలో వస్తోంది



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్ నటించిన 62వ చిత్రం 'విడాముయర్చి' వచ్చే నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించిన మేకర్స్ గురువారం సాయంత్రం ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. తెలుగులో 'పట్టుదల' పేరుతో రిలీజ్ చేయనున్నారు. మగిళ్ తిరుమేని దర్శకుడు. త్రిష హీరోయిన్. సీనియర్ నటుడు అర్జున్ ప్రతినాయకుడి పాత్రను పోషించగా, రెజీనా కెసాండ్రా మరో ముఖ్య పాత్రలో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చిన ఈ మూవీని లైకా ప్రొడక్షన్ పతాకంపై ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇక ఈ ట్రైలర్‌లో 'అజిత్, త్రిష ప్రేమని చూపించి, ఆ తర్వాత వీళ్ళకు ఒక సమస్య ఉత్పన్నం కాగా దానిపై హీరో ఎలా పోరాడాడు అన్నది 2 నిమిషాల 22 సెకన్లతో ఈ ట్రైలర్‌ను కట్ చేశారు. హాలీవుడ్ మూవీ 'బ్రేక్‌డౌన్'కు ఇది రీమేక్‌గా చెబుతున్నారు. నిజానికి సంక్రాంతి పండుగకు రిలీజ్ కావాల్సి ఉండగా, హాలీవుడ్ రీమేక్ హక్కులు పొందడంలో తలెత్తిన సమస్యల కారణంగా వాయిదా వేశారన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



మా కుటుంబంలో గొడవలు దురదృష్టకరం



తమ కుటుంబంలో గొడవలు జరగడం దురదృష్టకరమని మంచు మనోజ్ అన్నారు. గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి తన భార్య భూమా మౌనికతో కలసి మనోజ్ వచ్చారు. బుధవారం ఎంబీయూ విద్యాసంస్థల వద్ద జరిగిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సినిమాలకు 8 సంవత్సరాలు దూరంగా ఉన్నానని, ఇప్పటికీ తనకు అభిమానులు ఉండటం దేవుడు ఇచ్చిన వరమన్నారు. తనపై అభిమానంతో ఉన్న వారిని బెదిరించడం దారుణమన్నారు. ఏదైనా ఉంటే తనను పిలిపించి మాట్లాడుకోవాలే గానీ, తన అభిమానులు కట్టిన ఫ్లెక్సీలను తొలగించడం పద్ధతి కాదన్నారు. తన అభిమాని పళణి, వినాయకన్‌ను పిలిచి, తనతో తిరగకూడదని బెదిరించారని, పిలిచి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొంటే గొడవలు సద్దుమణుగుతాయన్నారు. ఎంబీయూలో జరిగే క్యాంపస్ గురించి చర్చించుకొంటే సరిపోతుందన్నారు. మంచు విష్ణు అనుచరులైన హేమాద్రి, కిరణ్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)


దబిడి దిబిడి.. కళలో ఓ భాగమే

- ఊర్వశీ రౌతేలా



'బాలకృష్ణ గారు ఓ లెజెండ్. ఆయనతో కలసి పనిచేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇదంతా కళలో భాగం. బాలకృష్ణతో డ్యాన్స్ చేయడం కేవలం పెర్ఫామెన్స్ కాదు.. కళపై నాకున్న గౌరవానికి చేసుకున్న వేడుకగా భావిస్తా' అని అన్నారు నటి ఊర్వశీ రౌతేలా. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణ - ఊర్వశీ రౌతేలా 'దబిడి దిబిడి' పాట బాగా పాపులర్ అయ్యింది. అయితే ఇందులో ఓ స్టెప్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ఊర్వశీ రౌతేలా ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ 'బాలకృష్ణ గారితో పనిచేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఆయన ఆర్టిస్టులకు ఎంతో గౌరవం ఇస్తారు. ఒక సినిమా విజయం సాధించినప్పుడు దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. నేను ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను' అని అన్నారు. కాగా, ఈ పాట విడుదలైనప్పుడు వచ్చిన ట్రోల్స్‌పై కూడా ఊర్వశీ స్పందించారు. 'జీవితంలో ఏం సాధించలేని కొందరు కష్టపడేవారిని విమర్శించే అర్హత ఉందనుకుంటారు. రియల్ పవర్ అంటే ఇతరులను విమర్శించడం కాదు. వారి గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవడం' అని ఓ నెటిజన్‌కు ఘాటుగా బదులిచ్చారు.





పశ్చిమ డెల్టా కాల్వకు 1616 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1616 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 140 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 179 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 65 క్యూసెక్కులు, నిజాం పట్నంకాల్వకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 653 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

23న లైవ్ మ్యూజిక్ కచేరీ

● లోకేశ్ బర్త్‌డే స్పెషల్ ప్రోగ్రామ్

మంగళగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలో ఈ నెల 23వ తేదీన లైవ్ మ్యూజిక్ షో నిర్వహించనున్నారు. 23న సాయంత్రం 6 గంటల నుంచి గౌతమబుద్ధ రోడ్డులోని ఎన్నారై జంక్షన్ వద్ద బెల్జియన్ వాఫిల్ స్టోర్ ఎదురుగా మియామీ కేఫ్ పక్కన ఉన్న మైదానంలో ఈ మ్యూజికల్ షో జరుగనుంది. ప్రముఖ సింగర్లు హాజరుకానున్న ఈ ఈవెంట్‌కు సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి. ప్రజలందరికీ ఉచిత ప్రవేశం ఉంటుందని, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

తాడేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికై విజయవాడ ధర్నా చౌక్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజ వెంకటేశ్వరరావు గురువారం కుంచనపల్లిలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాగ్దానం ప్రకారం రైతుకు పెట్టుబడి సాయం రూ.20వేలు జమ చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పంట కాలువల్లో పూడికతీత, తూటికాడ, గుర్రపుడెక్క తొలగించి శుభ్రం చేసి ఆధునికీకరించాలన్నారు. పాడి రైతులకు పొరుగు రాష్ట్రాలు ఇస్తున్న విధంగా లీటరుకు రూ.5లు బోనస్ అదనంగా కలిపి ఇవ్వాలన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు వెంటనే కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. పెదవడ్లపూడి హైలెవల్ ఎత్తిపోతల పథకం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు అమ్మిశెట్టి రంగారావు, శివారెడ్డి, సాంబయ్య, శ్రీనివాసరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో మంచినీటి సరఫరా



వాటర్ ట్యాంకర్ ద్వారా మంచినీరు అందిస్తున్న దృశ్యం

తాడేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి పంచాయితీ పరిధిలోని పోలకంపాడులో మంచినీటి పైపు లైన్లు మరమ్మతులకు గురి కావడంతో గ్రామస్తుల అభ్యర్థన మేరకు మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో గుంటూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం వాటర్ ట్యాంకర్‌తో మంచినీరు సరఫరా చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నాలుగు ట్రిప్పుల త్రాగునీటిని సరఫరా చేశారు. దీంతో గ్రామస్తులు మంత్రి నారా లోకేశ్‌కు జంగాల వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దళితవాడలో సమస్యలపై సర్వే

పెదనందిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులపాడులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం దళితవాడలో సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు సర్వే నిర్వహించారు. సమస్యలను నాయకులు, ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మురుగునీరు పారుదల సరిగా లేదని, శ్మశాన వాటిక సమస్యల ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదని, వర్షం పడితే అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రహరీ లేకపోవడంతో శ్మశానం ఆక్రమణకు గురవుతుందని, పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. వీటిపై కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా సహాయక కార్యదర్శి కొత్త వెంకటశివ, నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు, షేక్ మాబూ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషణ..

● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తాడికొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసును తాడికొండ పోలీసులు గురువారం నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోతడక గ్రామానికి చెందిన పల్లపాటి రాజేష్ రియల్ ఎస్టేట్‌లో మధ్యవర్తిగా వ్యవహరిస్తుంటాడు. కాగా నిడుముక్కల గ్రామానికి చెందిన వడ్లమూడి సాంబశివరావుకు చెందిన భూమిని తమిళనాడుకు చెందిన వ్యక్తి రాజేష్ మధ్యవర్తిగా ఉండి విక్రయించారు. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా ఉన్న రాజేష్‌కు రూ.10 లక్షలు బ్రోకరేజ్ ఇవ్వాల్సి ఉండగా రూ.2 లక్షలు మాత్రమే సాంబశివరావు ఇచ్చాడు. మిగిలిన రూ.8 లక్షలు డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడు. ఒక రోజు సాంబశివరావును డబ్బులు అడగ్గా రాజేష్‌ను కులం పేరుతో దూషించి దాడి చేశాడు. దీంతో సదరు వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోజి తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న భౌభౌలు

● ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో కుక్కలు
● భయాందోళన చెందుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు




తాడికొండలో రోడ్లపై తిరుగుతున్న వీధి కుక్కలు

తాడికొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నడివీధుల్లో గ్రామ సింహాలు ప్రజల పాలిట శాపంగా మారాయి. ఎక్కడ చూసిన పదుల సంఖ్యలో కుక్కలు వీధుల్లో, ప్రధాన రహదారుల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గ్రామాల్లోని వీధుల్లో వచ్చిపోయే ప్రయాణికుల వెంటపడుతూ ప్రజలను పరుగులు తీయిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా నివాసాల మధ్య వీరవిహారం చేస్తు పాదచారులను పరిగెత్తిస్తున్నాయి. కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోననే భయంతో చిన్నారులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాడికొండ ప్రధాన రహదారిలో, కంతేరు, పరిమి రోడ్లలో వీధి కుక్కలు స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లోని ఆలయానికి వచ్చే భక్తుల వెంట పడుతూ వణుకు పుట్టిస్తున్నాయి. ప్రశాంతంగా దేవుడిని దర్శించుకుని వచ్చే భక్తులు బెంబేలెత్తి పోతున్నారు. పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులపై శునకాలు దాడులు చేస్తాయని భయపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు నిత్యం వందలాది మంది విద్యార్థులు వచ్చి పోతుంటారు. సాయంత్రం వేళలో పదుల సంఖ్యలో ఉండే కుక్కలు విద్యార్థుల వెంటపడుతున్నాయి. తమ బిడ్డలకు కుక్కలతో ఎక్కడ ముప్పు సంభవిస్తుందోనన్న ఆందోళన తల్లిదండ్రులను పట్టి పీడిస్తోంది. కొన్నేళ్లుగా ఆయా ప్రాంతాల్లో కుక్కల సంచారం పెరిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. శునకాల సమస్య పరిష్కారించాల్సిన అవశ్యకత ఎంతైన ఉందని ప్రజలు వాపోతున్నారు. శునకాలను పట్టుకునేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుక్కలను అదుపుచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూటమి విజయంలో ఎన్నారైలది కీలకపాత్ర

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జనవరి 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ విజయంలో ఎన్నారైలు కీలకపాత్ర పోషించారని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక అరండల్‌పేట, టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సభకు ప్రముఖ ఎన్నారై అలోకం శ్రీరామ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ విదేశాల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఎదురొడ్డి కూటమి ప్రభుత్వం విజయానికి సహకరించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు పీ4 ఫార్ములాను నియోజకవర్గంలో అనుసరించాలని ఎన్నారైలు పిలుపునివ్వడం అభినందనీయమన్నారు. పీ4తో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. 2047 నాటికి పీ4 ఫార్ములతో పేదరికం లేని సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కలసిరావాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కల్గిన పేద విద్యార్థులకు అండగా నిలబడాలని ఎన్నారైలకు సూచించారు. అంతేగాక కూటమి విజయం కోసం నష్టపోయిన కుటుంబాలు, కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరి శీలకులు బీమినేని వందనాదేవి, నాయకులు కొర్ర పాటి నాగేశ్వరరావు, దేవతోటి నాగరాజు, జంపని హనుమంతరావు, కొల్లా వీరయ్య చౌదరి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, నువ్వుల సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూర్ల రామాంజనేయులు, పాల్గొన్న నియోజకవర్గ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

పెదనందిపాడు, జనవరి, 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగులపాడు గ్రామస్థులు తమ గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు.

గ్రామంలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి చెరువు ఊట వచ్చి నీరు రంగు మారి దుర్వాసన వస్తుందని దీంతో రోగాల బారిన పడుతున్నామని, పెదనందిపాడు నుంచి నాగులపాడు వచ్చే ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నిధులు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు, నాయకులు పాటిబండ్ల మురళి, ఆళ్ళ ఫణిబాబు, నార్ల రాజేష్, శ్రీకాంత్, దావులూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'పీఎం ఇంటర్న్ షిప్'తో యువతకు ఉపాధి అవకాశాలు

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యువత లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంను ప్రారంభించినట్లు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పీఎం ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ ఏ భార్గవ్ తేజతో కలసి గురువారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ బీఫార్మసీ, బీబీఏ, బీటెక్ వంటి డిగ్రీలు ఉన్న వారెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దీనికి 21-24 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని తెలిపారు.

ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి వన్ టైం ఇన్సిడెంట్ గ్రాంట్ రూ.6000, భారత ప్రభుత్వం ద్వారా నెల వారి సహాయం రూ .4,500, పరిశ్రమలు ద్వారా రూ.500 సంవత్సరం పాటు అభ్యర్థులకు ఆర్థిక సాయం అందిస్తారని తెలిపారు. ఇంటర్న్ షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంటుందని అన్నారు. ఇప్పటికే ఉన్న పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21వ తారీకు లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలిపారు. వివరాల కోసం ఏపీ ఎస్ఎస్‌డీసీ కమాండ్ కంట్రోల్: +91-998853335, 8712655686, 8790118349, 8790117279, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జీవీఎస్. సాయికుమార్: 8074597926 నెంబర్ నందు సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో షేక్. ఖజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీవో శేషశ్రీ, డీఈవో రేణుక, డీఎస్‌వో కోమలి పద్మ, జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, డీడీ మైన్స్ అండ్ జియాలజీ డీడీ శ్రీవెంకటసాయి, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, జిల్లా కోఆపరేటివ్ అధికారి తదితరులు పాల్గొన్నారు.


పీఎం ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ

నేడు హరిజన సొసైటీ కమిటీ ఎంపిక

తుళ్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) రాయపూడి హరిజన సొసైటీ కమిటీ ఎంపిక శుక్రవారం జరగనుంది. లంక భూములు సాగు చేసుకొని జీవనం పొందటం కోసం 35 సంవత్సరాల క్రితం 143 మంది సభ్యులతో ది హరిజన కో-ఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీని ఏర్పాటు చేశారు. అప్పట్లో పెదలంక 0.35 సెంట్లు, పూర్ణయ్య లంకలో 0.55సెంట్లు సాగు చేసుకోవడానికి డీ పట్టాలు ప్రభుత్వం వారికిచ్చింది. సాగుదారుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసుకున్న ఆ సొసైటీకి ప్రెసిడెంటు, సెక్రటరి, ముగ్గురు సభ్యులతో కలిగిన కమిటి ఎంపిక కానుంది. ఇందు కోసం రాయపూడి ఎల్ఈ పాఠశాలలో ఓటింగ్ పక్రియకు అధికారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ సొసైటీలో 300పైగా సభ్యులున్నారు. వారు కమిటీ ఎంపికకు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పదవులను ఆశించే అభ్యర్థులు నామినేషన్‌లు వేయటం, సభ్యులు ఓట్లు వేయటం, గెలిచిన వారిని ప్రకటించడమనే పక్రియ శుక్రవారం సాయంత్రం లోపు ముగియనుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు హరిజన సొసైటీ ఎన్నిక జరుగుతుందని అధికారులు తెలిపారు. తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అగ్నిప్రమాదంలో రోడ్డురోలర్ దగ్ధం


పేరుకలపూడి పెదపాలెం మధ్య జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన రోడ్డు రోలర్

దుగ్గిరాల, జనవరి 16: మండలంలోని పేరుకలపూడి సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రోడ్డురోలర్ కాలిపోయింది. మండలవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణాల్లో భాగంగా పూర్తిగా దెబ్బతిని గుంతలమయమైన రోడ్డు నిర్మాణం పనులు వారం రోజులుగా చేపడుతున్న విషయం విదితమే. కాగా గురువారం మధ్యాహ్నం రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండగా రోడ్డులెవల్ చేస్తున్న రోడ్డురోలర్ నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ కిందికి దూకేశాడు. స్థానికులు సమీపంలోని పంట కాల్వలో నుంచి నీటితో మంటలనార్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. తెనాలి నుంచి అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదంతో మోరంపూడి, పెదపాలెం వైపు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ నిలిచిపోయింది.

ప్రాణం పోతున్నా పట్టించుకోని వైద్యులు

● పురుగుమందు తాగిన వ్యక్తిని నిర్లక్ష్యంగా వదిలి వెళ్లిన తీరు
● విధులకు వచ్చి వెళ్లిపోతున్న వైద్యులు


వైద్యులు లేకపోవడంతో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు

ప్రత్తిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రాణం పోతున్నా కూడా పట్టించుకోకుండా గుంటూరు వైద్యశాలకు కేసును రిఫర్ చేసి ఇంటికి చిత్తగించేస్తున్నారు. పూర్తిగా స్టాఫ్ నర్సులు, సిబ్బందిపైనే వదిలి పెడుతున్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి గురువారం మధ్యాహ్నం కొప్పర్రు నుంచి పురుగుమందు తాగిని వ్యక్తిని కుటుంబసభ్యులు వైద్యశాలకు తీసుకువచ్చారు. ఆ సమయంలో సాయంత్రం వరకు విధుల్లో ఉండాల్సిన వైద్యులలో ఒక్కరు మాత్రమే ఉన్నారు. వారు కూడా ఇంటికి వెళ్లాలనే తొందరలో పేషెంటును పరిశీలించి గుంటూరు రిఫర్ చేసి ఇంటికి వెళ్లిపోయారు. సుమారు నాలుగు గంటల తరువాత అంబెలెన్సులో గుంటూరు తరలించారు. అయితే తాగిన పురుగుమందు ఏ స్థాయిలో పనిచేస్తుందో.. ఎప్పుడు ఎలాంటి అవసరం వస్తుందో కూడా పరిగణలోనికి తీసుకోకుండా సీరియస్‌గా ఉన్న పెషెంటును వదిలి పెట్టి ఆ వైద్యుడు వెళ్లిపోయాడు. సుమారు ఈ వైద్యశాలలో ఆరుగురు వైద్యులు పనిచేస్తున్నారు. వీరితో పాటు ప్రత్తిపాడు కో లోకేటెడ్ పీహెచ్‌సీకి సంబంధించి ఒక వైద్యుడు కూడా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. 24 గంటలు వైద్యసేవలు అందాల్సిన రిఫరల్ వైద్యశాలలో అత్యవసరం కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. ఈ వైద్యశాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు, వైద్యులు వారి ఇష్టమొచ్చినప్పుడు విధులకు రావడం, వెళ్లిపోవడం చేస్తున్నారు. ఇప్పటికే ఈ వైద్యశాలను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తనిఖీలు చేసి సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. అయినా కూడా వైద్యుల్లో మార్పు కనిపించక పోగా అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కళ్లముందు పురుగుమందు తాగిన వ్యక్తి ఉన్నా కూడా వైద్యుడు వెళ్లిపోవడం వారి నిర్లక్ష్యాన్ని చూపిస్తుంది.

44వ రోజుకు చేరుకున్న దీక్షలు

తాడేపల్లి టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు గురువారంతో 44వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడుతూ కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలే శరణ్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా కార్మికులకు ఇచ్చిన మాటలు నారా లోకేశ్ నెరవేర్చలేదన్నారు. వేముల దుర్గారావు మాట్లాడుతూ 32 సంవత్సరాల నుంచి సిమెంట్ కంపెనీ కార్మికులు నష్టపరిహారం కోసం ఎదురు చూస్తూ, అర్ధాకలితో అలమటిస్తున్నారని అన్నారు. న్యాయ బద్ధంగా కార్మికులకు రావలసిన నష్టపరిహారాన్ని కంపెనీ యాజమాన్యం చెల్లించే వరకు, ప్రభుత్వం జోక్యం చేసుకుని నష్టపరిహారం ఇప్పించేంత వరకు కార్మికుల పోరాడుతూనే ఉంటారని అన్నారు. ఈ దీక్షల్లో ఎస్‌కే ఇమాంబి, దానమ్మ, బూదెమ్మ, శాంతమ్మ, రమణ కూర్చున్నారు. కార్యక్రమానికి మద్దతుగా యూనియన్ నేతలు పాల్గొన్నారు.

మిరపలో తెల్లనల్లి, కాయ కుళ్లు తెగుళ్లు

● ఏరువాక శాస్త్రవేత్త వెంకట లక్ష్మి

వట్టిచెరుకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో మిరప పంటలో తెల్లనల్లి, బూడిద, కాయకుళ్లు తెగుళ్ల కనిపిస్తున్నాయని, ఇవి ఉధృతమయ్యే ప్రమాదం ఉందని ఏరువాక శాస్త్రవేత్త వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని పల్లపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. తొలుత మండల వ్యవసాయ అధికారి కే లక్ష్మి, స్థానిక ఏవోలు, ప్రకృతి వ్యవసాయ శాఖ ఐసీఆర్‌పీలు రైతులతో కలసి ఆమె క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మిర్చి పొలాలను ఆమె నిశితంగా పరిశీలించారు. రసాన్ని పీల్చే పురుగులు ఉధృతంగా ఉన్నాయని తెలిపారు. ఇవి ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చటం వల్ల ఆకులు వెనుక్కు ముడుచుకుపోతాయన్నారు. వీటి వల్ల పూత రాలి పోవటం, గణనీయంగా దిగుబడులు తగ్గుతాయన్నారు. యాజమాన్య పద్ధతులు వేప సంబంధిత పురుగు మందులతో పాటు నీటిలో కరిగే గంధం తదితర మందులను పిచికారి చేయాలన్నారు.

సంక్రాంతి పోటీల్లో విజేతలకు బహుమతులు


విజేతలైన మహిళలకు బహుమతులను అందిస్తున్న తాడిబోయిన రామస్వామి, జెట్టి బాలరాజు తదితరులు

దుగ్గిరాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో మూడ్రోజుల పాటు జరిగిన సంక్రాంతి క్రీడా ఉత్సవాల్లో పాల్గొని విజేతలైన మహిళలకు బహుమతులను గురువారం అందించారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దుగ్గిరాల గణేష్‌నగర్, చెన్నకేశవనగర్, తుమ్మపూడి, మంచికలపూడి గ్రామాల్లో మహిళలకు, బాలికలకు కుర్చీలాట, ముగ్గుల పోటీలు, టగ్‌ఆఫ్ వార్, లెమన్‌స్పూన్ తదితర పోటీలను నిర్వహించారు. ముక్కనుమను పురస్కరించుకుని గురువారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. జెట్టి బాలరాజు, చింతమనేని బాలకృష్ణ, తాడిబోయిన రామస్వామి, బీ అమ్మిరెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్డీఏ భూముల్లో పంట తొలగింపు


సీఆర్డీఏ భూముల్లో వేసిన పంట తొలగింపులో పాల్గొన్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

తుళ్లూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శాఖమూరు రెవెన్యూ పరిధిలోని సీఆర్డీఏ భూముల్లో వేసిన జొన్న పంటను గురువారం తొలగించారు. సుమారు 15 ఎకరాల్లో వేసిన జొన్న పంటను రెవెన్యూ సిబ్బంది, పోలీసు యంత్రాంగంతో కలసి ట్రాక్టర్‌తో దున్ని జొన్నను తొలగించారు. సీఐ గంగా వెంకటేశ్వరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఎవరూ కూడా పంటలు వేయరాదని ఇంతకు ముందే సీఆర్డీఏ అధికారులు రాజధాని గ్రామాల్లో ప్రచారం చేసి తెలియజేశారు. కాదని సాగుకు దిగితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి లక్షా పదివేల ఆర్థిక సాయం


విద్యార్థిని వర్షకు చెక్కు అందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, నాగకిరణ్

తాడేపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి లాం చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. విజయవాడ సిద్దార్థ మెడికల్ కాలేజీలో చదువుతున్న మరీదు వర్ష చదువు నిమిత్తం ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నందున రామ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాతలు ఊడ శిన్నారాయణ, సమ్మెట నాగకిరణ్‌ల సహకారంతో రూ.1.10 లక్షల చెక్కును సదరు విద్యార్థినికి గురువారం అందజేశారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాల బాలికల్లో ప్రతిభను వెలికితీయాలి

● సర్పంచ్ కర్నాటి బాల కోటేశ్వరరావు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ కర్నాటి బాల కోటేశ్వరరావు

తాడికొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బాల బాలికల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని ఫణిదరం సర్పంచ్ కర్నాటి బాల కోటేశ్వరరావు తెలిపారు. గురువారం ఫణిదరంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో బాలమేళా అనే ఆటల పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని బాల బాలికలను ఒక చోటకు చేర్చి వారితో ఆటలు ఆడించటం సంతోషమని అన్నారు. అందరూ కలిసి ఆడుకోవడం వల్ల స్నేహపూర్వకమైన ఆలోచనలు కలుగుతాయన్నారు. బాలలు ఆట పాటలతో పాటు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రాఫ్ కో-ఆర్డినేటర్ చిలకా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో రకరకాల ఫన్నీ గేమ్స్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. గెలిచిన వారికి ఫైల్స్, జామెంట్రీ బాక్స్, ఎగ్జామ్ ప్యాడ్, పెన్సిల్ బాక్స్, 100 మంది బాల బాలికలకు పెన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్నాటి విశ్వేశ్వరరావు, మాజీ వైస్ సర్పంచ్ సాంబశివరావు, పంచాయతీ వార్డు మెంబర్స్ మిండాల వెంకట యజ్ఞకుమార్, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి తబిత శాంతి, క్రాఫ్ జిల్లా కో- ఆర్డి నేటర్ జీ వెంకట్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ


పంచాయతీ వర్కర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తాడికొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నెకల్లు పంచాయతీ కార్మికులకు టీడీపీ నాయకులు సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుంటుపల్లి మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతి సంక్రాంతికి పంచాయతీలో పనిచేసే కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేయటం అనవాయితీగా వస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటే అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తారన్నారు. ప్రతి పండుగను ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకుంటున్నారన్నారు. పంచాయతీ వర్కర్లు గ్రామాన్ని ప్రతి రోజు పరిశుభ్రం చేయటంలో నిమగ్నమై ఉంటారని, వారికి నూతన వస్త్రాలు ఇవ్వటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ధనేకుల నాగ మల్లేశ్వరరావు, గ్రామ పంచాయతీ సెక్రటరి షేక్ జానీ, గ్రామ అధ్యక్షుడు నెల్లూరి కాంతారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు భూశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో అపశృతి

ఫిరంగిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 113 తాళ్ళూరు గ్రామంలో బుధవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా కుర్చీలాట ఆడుతున్న మహిళ కొండా లక్ష్మి(33) ఒక్కసారిగా కుప్ప కూలింది. పడిపోయిన కొండా లక్ష్మిని 108 వాహనంతో గుంటూరుకు తీసుకెళ్లేలోగా మార్గం మధ్యలో మృతి చెందిందని బంధువులు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

18న మెగా రక్తదాన శిబిరం

తెనాలి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 18న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ ఓ ప్రకటన తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రి, గుంటూరు, కృష్ణా జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పాల్గొనేవారు ముందుగా ఫోన్ నెంబర్లు 9440249330, 8555972269, 98499111258, 9290209278 పేర్లు నమోదు చేయించుకోవాలని హరిప్రసాద్ కోరారు.



ఆటోనగర్‌లో కారు చోరీ

పెదకాకాని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో కారు చోరీ అయినట్లు గురువారం పెదకాకాని పోలీసులు తెలిపారు. ఆటోనగర్లోని టాటా షోరూంలో బుధవారం అర్ధరాత్రి గోరంట్లకు చెందిన దిలీప్ అనే వ్యక్తి వచ్చి నా కారు సర్వీసింగ్‌కి ఇచ్చాను అని చెప్పి, వాచ్‌మెన్‌ను నమ్మించి షోరూమ్‌లోని కొత్త కారును తీసుకొని వెళ్ళిపోయాడు. వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

కాల్వ కట్టపై గుర్తు తెలియని మహిళ మృతదేహం

తెనాలి క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపేట కాల్వకట్టపై గుర్తు తెలియని మహిళ (55) మృతదేహాన్ని గురువారం ఉదయం గుర్తించినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. మృతురాలు గతంలో ఓ కర్రీపాయింట్‌లో పనిచేసే వ్యక్తితో కలిసి ఉండేది. ప్రస్తుతం ఒంటరిగా ఉంటోంది. మృతురాలి పూర్తి సమాచారం అందాల్సి ఉందని దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

తెనాలి క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై కత్తితో దాడిచేసిన సంఘటన స్థానిక గాంధీచౌక్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలుకు చెందిన సుభాని (35) అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన అప్జల్, మరో వ్యక్తి కలిసి కత్తితో దాడిచేసినట్లు చెప్పారు. స్థానికులు బాధితుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు అక్కడి వైద్యుల సూచన మేరకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై పూర్తి సమాచారం అందవలసిన ఉందని వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెనాలి, మారీసుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నేడు శుక్రవారం మండల పరిధిలోని సంగం జాగర్లమూడిలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్నందున సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ తోటకూర వీర వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో చెట్ల కొమ్మలు తొలగించడం, ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు కోసం ఉదయం 9.00గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ పేర్కొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

● రూ. 7.55 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ కేవీఎల్ఎన్‌మూర్తి నేతృత్వంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) సీహెచ్ వెంకటేశ్వరరావు, తెనాలి డివిజన్ ఆపరేషన్ వీవీ చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 59మంది అధికారులు, 177మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5277 సర్వీసులు తనిఖీచేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, ఇతర కేటగిరీల్లో, అదనపు లోడ్‌తో వినియోగించటంపై 204మందికి 7.55 లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812361కు ఫిర్యాదులు చేయాలని కోరారు. దాడుల్లో డిప్యూటీ ఈఈలు ఎస్.మల్లికార్జునప్రసాద్, ఏఈలు ఎమ్.సతీష్‌కుమార్, యు.శివశంకర్, ఆపరేషన్ ఏఈ పీవీ సుధీర్ తదితరులున్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ: ఎంఈవో

పొన్నూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి స్లో లెర్నర్స్ విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు ఎంఈవో రాయల సుబ్బారావు తెలిపారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు సెలవ రోజుల్లో జరుగుతున్న రెమిడీయల్ శిక్షణ తరగతులను గురువారం ఎంఈవో పరిశీలించి సూచనలు చేశారు. స్లో లెర్నర్స్‌కు అదనపు తరగతి నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. మూడు నమూనా ప్రశ్నాపత్రాలను అనుసరించి సాధన చేయించాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మాధవీలత, ఎం. వెంకటేశ్వరరావు, కృష్ణారావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాపీ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలి, మారీసుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన తాపీ కార్మికుని కుటుంబానికి ది తెనాలి తాలూకా పట్టణ భవన నిర్మాణ తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్థికసాయం అందించారు. గురువారం స్థానిక చినరావూరు డొంక రోడ్డుకు చెందిన తాపీ కార్మికుడు కోడూరి సమాధానం బుధవారం మృతి చెందటంతో యూనియన్ నాయకులు స్పందించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

చిట్టడివిలా జగనన్న కాలనీ

● సంగంజాగర్లమూడిలో పెరిగిపోయిన ఊద, గడ్డిజాతి మొక్కలు

● అధికారులు దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని పలువురి వినతి



గడ్డిజాతి మొక్కలతో కప్పిఉన్న కాలనీ, పక్కన మట్టిరోడ్డు



నిర్మాణంలో ఉన్న ఇంటి పరిసరాల్లో పెరిగిన ఊద, గడ్డిజాతి మొక్కలు

తెనాలి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం గత వైసీపీ ప్రభుత్వం సంగంజాగర్లమూడి శివారు పంట పొలాల్లో జగనన్న కాలనీ పేరిట స్థలాలను కేటాయించింది. అందులో 161 ప్లాట్లు వేయగా పేదలకు 159 పట్టాలు అందించింది. ఐతే అంతమంది లబ్ధిదారులు ఉన్నా కేవలం ఒక్క ఇల్లు మాత్రమే పూర్తి కావడం విశేషం. మిగిలినవాటిల్లో కొన్ని బెస్‌మెంట్ లెవల్‌లో ఉండగా ఇంకొన్ని ఖాళీగా వదిలేశారు. మరికొన్ని సగంలోనే నిలిచిపోయాయి. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో కనీసం కాలనీకి సరైన రోడ్డుమార్గం కూడా ఏర్పాటు చేయలేకపోయింది. పేదలను ఉద్ధరిస్తామని నమ్మబలికి ఎకరాల్లో పంట భూములు కొని వాటిని సెంట్లులెక్క మార్చి పేదల నివేసన స్థలాలపేరిట లే అవుట్‌లు వేసింది. గ్రామం నుంచి దాదాపుగా మూడు కిలోమీటర్లు వెళ్తే డొంకరోడ్డులో పంట పొలాల మధ్య ఈ కాలనీ దర్శనమిస్తూ ఉంటుంది. చుట్టూ రెల్లి, తుంగ వంటి గడ్డిజాతి మొక్కలతో కాలనీ కప్పి ఉంటుంది. అడపాదడపా నిర్మాణాలు జరుగుతున్న ఆనవాళ్లను గుర్తించి ఇదే కాలనీ అని భావించాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. ప్రజలు నివాసం ఉండేందుకు ప్రధానంగా అవసరమైన మౌలిక వసతులు సైతం కల్పించలేదు. విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటుచేసి బోర్ పంపులు నిర్మించుకునేలా స్థల లబ్ధిదారులకు చెప్పడం మినహా ప్రభుత్వం అందించాల్సిన డ్రెయిన్లు, అంతర్గత రోడ్లు, వైద్యసేవలకు ప్రాథమిక కేంద్రం, తాగునీటి ట్యాంక్‌లు, కాలనీ నుంచి ప్రధాన రహదారికి చేరేందుకు బస్సు లేదా ఇతర వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయడంలో ఏ మాత్రం ప్రయత్నించిన ఆనవాళ్లు కూడా లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల సొంతింటి కళను నెరవేరుస్తానని కల్లబొల్లి మాటలు చెప్పటమే తప్ప ఆ దశగా అడుగు వేసిందే లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాలనీలను పరిశీలించగా గ్రామ శివారుల్లో పంట పొలాల మధ్యన కాలనీలకు స్థలాలు కేటాయించి వదిలేసినట్లు గుర్తించింది. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కాలనీలలో నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభించారు. సంగంజాగర్లమూడి లే అవుట్‌లలో కూడా పనులు చేపట్టారు. అయితే కాలనీ స్థలాల చుట్టూ వ్యాపించి ఉన్న గడ్డి జాతి మొక్కలు తొలగించని పరిస్థితి ఉంది. గ్రామ శివారులో పంటపొలాలు ఉండటం, మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి పలు సమస్యలు ఈ కాలనీలో ఉన్నాయి. ఇప్పటికైనా ఆ స్థలాల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకులుగా ఉన్న సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్



పారిశుధ్య కార్మికుల హాజరు నమోదును పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు పలు డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం 1, 6, 7వ డివిజన్‌లో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డ్రెయిన్‌ల నుంచి తొలగించిన సిల్ట్‌ను, రోడ్లపై ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. ప్రజలు కూడా ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు అందించాలని మూడు బుట్టల విధానాన్ని అనుసరించాలని కోరారు. సుందర తెనాలికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం 1వ డివిజన్‌లోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల మచ్చురు రిజిస్టర్‌ను పరిశీలించి ప్రతిరోజు కార్మికుల హాజరు వందశాతం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుర్రిపాలెం రోడ్డులో...

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డులో జరుగుతున్న వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితులకు తక్షణ సాయం అందిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఇల్లు, ఇంట్లో వస్తువులు పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు తహసీల్దార్ తక్షణ సాయం అందజేశారు. పట్టణంలోని తూర్పు కాలువ కట్టపై పూరింట్లో నివాసముంటున్న నక్కా ఫ్రాన్సిస్, జయప్రసాద్‌ల ఇల్లు బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. పెరుగు మార్కెట్లో కూలీగా పనిచేసుకునే ఆ కుటుంబాన్ని తహసీల్దార్ గోపాలకృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గురువారం పరామర్శించారు. గోపాలకృష్ణ తక్షణసాయం కింద రూ.5000, బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ తరుపున వంట సామగ్రిని అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో రెవెన్యూ, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఢిల్లీ ఎక్స్‌పో మార్ట్‌లో డబుల్ హార్స్ ఉత్పత్తులు ప్రదర్శిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఢిల్లీ ఎక్స్‌పోలో డబుల్ హార్స్ ఉత్పత్తుల ప్రదర్శన

తెనాలి అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరిగిన ఇండస్ ఫుడ్ 2025 ఎక్స్‌పోలో తెనాలి డబుల్ హార్స్ ఉత్పత్తులను సంస్థ ప్రతినిధులు ప్రదర్శించారు. ఇండియా ఎక్స్‌పొజిషన్ మార్ట్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ఎక్స్‌పోలో 20దేశాల ఆహార ప్రాసెసింగ్ సంస్థలు పాల్గొన్నాయి. 1800లకు పైగా ప్రదర్శకులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. డబుల్ హార్స్ ఛైర్మన్, ఎండీ మునగాల మోహన్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, గ్రామీణ ఆహార పదార్థాలు ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ వేదిక దోహదపడుతుందన్నారు. గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పతనాన్ని ముందుకు తీసుకువెళ్లే అవకాశం కల్పించిందని చెప్పారు.

భూ రీ సర్వేను వేగవంతం చేయండి

● అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ శివన్నారాయణ

తెనాలి, మారీసుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని భూ రీసర్వేను వేగవంతంచేసి నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ శివన్నారాయణ టౌన్ ప్లానింగ్ సెక్రటరీలకు సూచించారు. గురువారం పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో శివన్నారాయణ టౌన్ ప్లానింగ్ సెక్రటరీలలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో భూ రీ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి మూడు రోజులు అభిషేకాలు

పొన్నూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని వీరాంజనేయ స్వామికి వారంలో మూడు రోజుల పాటు అభిషేకాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గద్దె అమర్నాథ్ గురువారం తెలిపారు. ఇప్పటి వరకు వారంలో ఒకరోజు మాత్రమే అభిషేకాలు చేస్తుండగా ఇక నుంచి వారంలో మంగళవారం, శనివారం, ఆదివారం అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారుజ అలాగే స్వామివారి జన్మ నక్షత్రమైన పూర్వభాద్ర నక్షత్రం రోజున కూడా అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

పొలం అమ్ముతామని మోసం

తెనాలి అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి : ఎవరిదో పొలం చూపించి తక్కువ రేటుకు అమ్ముతామని ఓ వ్యక్తిని మోసం చేసి రూ.86లక్షలు తీసుకున్న వారిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తమిళనాడులోని సేలంకు చెందిన పి.జయరాజు ఐతానగర్‌లో తనకు పరిచయం ఉన్న వారితో పొలం కావాలని సంప్రదించాడు. నక్కా శివకుమార్, కృష్ణ, మంచాల మహాలక్ష్మిలు అమరావతిలో తమకు పొలం ఉందని తక్కువ ధరకు ఇస్తామని నమ్మబలకడంతో పొలం చూపించాలని కోరిన అతనికి అక్కడకు వెళ్లి పొలం చూపించారు. దీంతో ఆయన వారి బ్యాంకు ఖాతాలకు రూ.86లక్షలు జమ చేశారు. రిజిస్ట్రేషన్ కోసం అడుగుతుండగా సమయం దాటవేస్తూ వచ్చారు. గత సంవత్సరం నుంచి జరుగుతున్న ఈ వ్యవహారంతో మోసపోయానని గ్రహించి నగదును ఇవ్వమని కోరినా ఫలితం లేకపోవడంతో గురువారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో రైలు ప్రయాణికుడు మృతి

తెనాలి క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు-విజయవాడ ప్యాసింజర్ రైలులో గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ జి.వెంకటాద్రి గురువారం తెలిపారు. గూడూరు-విజయవాడ మధ్య నడిచే ప్యాసింజర్ రైలులో మార్గమధ్యలో ఓ గుర్తు తెలియని ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడు. ట్రైన్ టీసీ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని తెనాలి స్టేషన్‌లో దింపి 108 వైద్యులు పరీక్షించిన అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు విజయవాడలో రైతుల ధర్నా

తెనాలి అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ శనివారం విజయవాడ అలంకార్ సెంటర్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పంట పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని చెప్పారని, కానీ ఖరీఫ్ ముగిసి రబీ నడుస్తున్నా సాయం ఊసే లేదన్నారు. ధర్నాకు తరలి రావాలని రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి జొన్నా శివశంకరరావు, ములకా శివసాంబిరెడ్డి, భాస్కర్‌చంద్, కోటేశ్వరరావు, బాలరాజు, బ్రహ్మేశ్వరరావు కోరారు.

చినరావూరు పార్కుకు సందర్శకుల తాకిడి

● ఇటీవల మరమ్మతులు చేయించి ప్రారంభించిన మంత్రి మనోహర్

● ఉచిత ప్రవేశం కల్పించిన ప్రభుత్వం





పార్కు చెరువులో ఏర్పాటుచేసిన పడవలు, ఏనుగుల బొమ్మల వద్ద ఫొటోలు దిగుతూ సందర్శకుల సందడి

తెనాలి అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చినరావూరు పార్కు సందర్శకుల తాకిడితో కిటకిటలాడింది. ఈ పార్కును అభివృద్ధి చేయించి ప్రవేశాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉచితం చేశారు. దీంతో పార్కు సంక్రాంతి సెలవుల్లో సందర్శకులతో నిండిపోతుంది. పార్కులో రకరకాల మొక్కలను ఏర్పాటుచేశారు. ఏనుగు బొమ్మలను నెలకొల్పడంతో చిన్నా, పెద్దా ఫొటోలతో సందడి చేస్తున్నారు. కొత్తగా లోపల ఉన్న భవనంలో కొత్తగా గేమింగ్ జోన్ ఏర్పాటు చేయడంతో పిల్లలు ఉత్సాహంగా వస్తున్నారు. దీంతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోతోంది. పిల్లలు ఆడుకునే వస్తువులను కూడా బాగుచేయించి కొత్తవాటిని ఏర్పాటు చేశారు. రకరకాల విద్యుత్ దీపాలతో చెట్లను, స్తంభాలను అలంకరించారు. దీంతో పార్కులో సేదతీరేందుకు ఆనందం, ఆహ్లాదం పొందేందుకు పట్టణ ప్రజలు పిల్లలతో భారీగా తరలివస్తున్నారు. పార్కులో ఉన్న చెరువులో నాలుగు పడవలను కొత్తగా ఏర్పాటు చేసినప్పటికి ఇంకా బోటు షికారు మొదలు పెట్టలేదు. అదే విధంగా గతంలో మనోహర్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఈ పార్కును అభివృద్ధి చేసి వాటర్ మ్యూజికల్ ఫౌంటెన్‌ను ఏర్పాటు చేశారు. ఇది కూడా గత కొంత కాలంగా పని చేయడం లేదు. ఈ రెంటిని వినియోగించుకునేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో పార్కు అంతా ఉదయం, సాయంత్రం సందడిగా మారుతోంది.

పనిచేయని ఆర్వో ప్లాంట్

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పురపాలక సంఘంలోని ఆర్వో ప్లాంట్

తెనాలి, మారీసుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం తెనాలి పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్ పనిచేయటం లేదు. గత కొన్ని నెలలుగా సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు దానిపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజలకు సురక్షిత తాగునీరు అందడంలేదు. దానిపై రిపేరులో ఉంది కావున పనిచేయుటలేదు అని బోర్డును పెట్టి ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేయించకుండా అధికారులు వదిలేశారు. పురపాలక సంఘంలో ప్లాంట్ నిర్లక్ష్యానికి గురికావడం, వివిధ పనుల నిమిత్తం అధికారుల కోసం కార్యాలయానికి వచ్చేవారు దాహం వేస్తే దగ్గర లోని షాపులలో నీరు కొని తాగవలసిని పరిస్థితి ఏర్పండిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి ఆర్వో ప్లాంట్‌ను రిపేరు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్థికసాయం అందచేస్తున్న ముస్లిం నాయకులు

యువతి వివాహానికి ఆర్థికసాయం

పొన్నూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ముస్లిం యువతి వివాహానికి తెలుగుదేశం పార్టీ ముస్లీం మైనార్టీ నాయకులు గురువారం రూ. 5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పట్టణంలోని ముబారక్ నగర్ 21వ వార్డుకు చెందిన యువతి వివాహానికి ఏపీజే అబ్దుల్ కలాం షాదీ ఖానా నిధుల నుంచి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, దాసరి విజయ్, షేక్ బాజీ సాహెబ్, సయ్యద్ ఇస్మాయిల్, కరిముల్లా బాజీ, ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల దీక్షకు బీఎస్పీ మద్దతు


పొన్నూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో జరుగుతున్న న్యాయవాదుల దీక్షకు పదవ రోజు గురువారం బీఎస్పీ సంఘీభావం తెలిపింది. బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి ఏతాటి కిషోర్ ఆధ్వర్యంలో న్యాయవాది బేతాళ ప్రకాష్‌కు మద్దతు తెలిపి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. న్యాయవాది ప్రకాష్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పులుగు ఇమ్మానియేల్, బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



ఇది అతని సంతకం నాటికలో ఓ సన్నివేశం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కొల్లిపర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళా ప్రాంగణంలో శ్రీ కళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు వైభవంగా ముగిశాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలను పలువురు ప్రముఖులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాడాలని ఉంది సినీ సంగీత విభావరి రసూల్, రాజశ్రీ, కృష్ణశ్రీ, యాగప్రియలు పాడిన పాటలు ప్రేక్షకులు మైమరిచిపోయారు. అనంతరం అభినయ ఆర్ట్స్ గుంటూరు వారు నిర్వహించిన ఇది అతని సంతకం నాటిక పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీకళానిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కళలు రాను, రాను అంతరించిపోతున్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. శ్రీకళా నిలయం కమిటీ సభ్యులు కళాకారులను శాలువాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకళా నిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆరిమండ పెదనాగిరెడ్డి, ఏఆర్ఆర్ కళాశాల కార్యదర్శి అవుతు కృష్ణారెడ్డి, కోశాధికారి గుదిబండి మహేశ్వరరెడ్డి, సహాయ కార్యదర్శి అన్నవరపు రమేష్, కార్యవర్గసభ్యులు ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో సమితి ప్రతినిధులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు

తెనాలి అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈదర విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రతిభ కలిగిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. నందులపేటలో జరిగిన కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీలో చేరిన విద్యార్థులకు రూ.2వేలు నగదు, జ్ఞాపిక అందజేశారు. ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ, 20సంవత్సరాలకు పైగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహిస్తూ ట్రస్ట్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఈదర వెంకట్రావు, వేజండ్ల ఉమామహేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, ఈదర శ్రీనివాసరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. షేక్ నెహ పర్వీన్, రాధాచంద్రిక, రూపశ్రీ, నాగూర్ షరీఫ్ బహుమతులు అందుకున్నారు.

డీఎస్‌వో కుటుంబానికి కమిషనర్ పరామర్శ

తెనాలి, మారీసుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బుధవారం మృతిచెందిన మున్సిపల్ డీఎస్‌వో సయ్యద్ షరీఫ్ కుటుంబ సభ్యులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం పరామర్శించి, వారికి సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.